ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
సోమవారం 18, నవంబరు 2024

ఒంగోలు నగర పాలక సంస్థలో పారిశుధ్య విభాగం పనితీరు అస్తవ్యస్తంగా తయారైంది. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ల ఇష్టారాజ్యం నడుస్తోంది. గత వైసీపీ పాలనలో రాజకీయ పలుకుబడితో ఉద్యోగాల్లో చేరిన వీరు పారిశుధ్య పర్యవేక్షణను గాలికొదిలేసి పెత్తనం చెలాయిస్తున్నారు. అర్హత లేకుండానే అందలమెక్కి 'అంతా మా ఇష్టం' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు పైసల వేటలో మునిగి తేలుతున్నారు. గృహ వినియోగదారుల నుంచి చెత్తపన్ను వసూలును రద్దు చేసిన కూటమి ప్రభుత్వం వివిధ సంస్థలు, కార్యాలయాలు, హోటళ్లు, ఆసుపత్రులకు మాత్రం కొనసాగిస్తోంది. ఆ యూజర్ చార్జీల్లోనూ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చేతివాటం చూపుతున్నారు. సచివాలయాల్లో పనిచేసే పారిశుధ్య కార్యదర్శులపై కూడా వీరికే అధికారం కల్పించడం విస్తుగొలుపుతోంది. కార్యదర్శులకు సెలవులు కూడా ఇన్‌స్పెక్టర్లు మంజూరు చేయాల్సి రావటం విడ్డూరంగా ఉంది. దీన్ని అవకాశం చేసుకొని కనీసం పదో తరగతి అర్హత కూడా లేని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సచివాలయాల్లో కార్యదర్శులుగా పనిచేస్తున్న ఉన్నత విద్యావంతులపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు.



అంతా మా ఇష్టం

- పారిశుధ్య విభాగంలో ఇన్‌స్పెక్టర్ల ఇష్టారాజ్యం
- వైసీపీ పాలనలో అడ్డగోలుగా నియామకం

- అప్పటి నేతల సిఫార్సులతో అర్హత లేకుండానే అందలం
- సచివాలయ సెక్రటరీలపై వారికే పెత్తనం
- యూజర్ చార్జీల్లో చేతివాటం
- కార్మికుల మస్టర్‌లో మాయాజాలం
- ఒంగోలు కార్పొరేషన్‌లో ఇదీ పరిస్థితి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. గత వైసీపీ పాలనలో అర్హత లేకుండానే అందలమెక్కి అధికార దర్పం ప్రదర్శించిన వారు ఇప్పటికీ అదే పంథాను కొనసాగిస్తున్నారు. ఒకవైపు నగర సుందరీకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వారానికో వార్డులో ప్రత్యేక కార్యక్రమం చేపట్టగా ఇన్‌స్పెక్టర్లుగా కొనసాగుతున్న వారు పర్యవేక్షణను గాలికొదిలేసి పెత్తనం చేసేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. చెత్తపన్ను వసూలులోనూ చేతివాటం చూపిస్తూ అవినీతి కంపు కొట్టిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ వచ్చి శానిటరీ సెక్రటరీల నియామకం కావడంతో ఇతర జిల్లాల్లో ఇన్‌స్పెక్టర్ల వ్యవస్థను రద్దు చేశారు. కానీ అందుకు భిన్నంగా ఒంగోలులో మాత్రం కొనసాగుతోంది.

చెత్త సేకరణలో చేతివాటం

ఇళ్ల నుంచి చెత్త సేకరణపై యూజర్ చార్జీలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసింది. వ్యాపారాలకు సంబంధించి మాత్రమే కొనసాగిస్తోంది. హోటళ్లు, ఆసుపత్రులు, లాడ్జిలు, కాలేజీలు, విద్యా సంస్థలు, వివిధ దుకాణాలు, అలాగే చిన్నచిన్న పరిశ్రమల వద్ద నుంచి వసూలు చేస్తున్న యూజర్ చార్జీలను కార్పొరేషన్ కార్యాలయానికి చెల్లించకుండానే కొందరు ఇన్‌స్పెక్టర్లు జేబుల్లో వేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పారిశుధ్య కార్మికులు ఎక్కువ రోజులు సెలవులు పెడితే మస్టర్ వేసి, ఆ రోజుల్లో వారికి వచ్చే కూలి డబ్బులను కూడా ఇన్‌స్పెక్టర్లు దిగమింగుతున్నట్లు తెలుస్తోంది.

ఇన్‌చార్జులను నియమిస్తేనే మార్పు

కార్పొరేషన్‌లో అర్హత లేని వారిని ఇన్‌స్పెక్టర్లుగా నియమించడంతో పారిశుధ్య విభాగం పట్టు తప్పింది.



శానిటరీ సెక్రటరీలపై పెత్తనం

నగరంలో 50 డివిజన్‌లు ఉన్నాయి. అధికారులు వాటిని 5 శానిటరీ డివిజన్‌లుగా విభజించి ఇన్‌స్పెక్టర్‌లను నియమించారు. ఆయా డివిజన్‌లలో పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు 80 మంది ఉన్నారు. ఆప్కాస్ కింద 681 మంది కొనసాగుతున్నారు. వీరితోపాటు కొవిడ్ విధుల కింద మరో 150 మంది పనిచేస్తున్నారు. వారిపై అధికారులుగా శానిటరీ కోర్సు చదివిన వారు సూపర్‌వైజర్లుగా కొనసాగుతున్నారు. నగరంలోని 70 డివిజన్‌లకు సంబంధించి సచివాలయ శానిటరీ సెక్రటరీలు ప్రతిరోజూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పేరుతో కొందరు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న వారిని గత వైసీపీ పాలనలో అప్పటి నాయకుల సిఫార్సు మేరకు ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. వీరిలో ఒక్కరు మినహా మిగిలిన వారికి 10వ తరగతి అర్హత కూడా లేదు. వీరు ఉన్నత విద్యావంతులైన శానిటరీ సెక్రటరీలపై పెత్తనం చేస్తున్నారు. శానిటరీ సెక్రటరీలకు కనీసం ఒక రోజు సెలవు కావాలన్నా ఇన్‌స్పెక్టర్‌ను ప్రసన్నం చేసుకోవాల్సి వస్తోంది. ఆ సమయంలో వారు అనేక ఇబ్బందులు పెడుతున్నారని శానిటరీ సెక్రటరీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమపై ఇన్‌స్పెక్టర్ల పెత్తనం తొలగించి అర్హత కలిగిన వారిని ఇన్‌చార్జులుగా నియమించాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నత విద్య చదువుకుని ఉద్యోగాలు పొందిన సెక్రటరీలను ఇన్‌చార్జిలుగా నియమిస్తే మరింత మెరుగుపడే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్లానింగ్ సెక్రటరీలను టౌన్ ప్లానింగ్ విభాగంలో ఇన్‌చార్జులుగా నియమించారు. ఎమినిటీ సెక్రటరీలు ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్లుగా కొనసాగుతున్నారు. అదే తరహాలో పారిశుధ్య విభాగంలో ప్రస్తుతం కొనసాగుతున్న కనీస విద్యార్హత లేని ఇన్‌స్పెక్టర్లను తొలగించడంతోపాటు, సచివాలయ శానిటరీ సెక్రటరీలకు ఆ బాధ్యతలు అప్పగించడం ద్వారా పారిశుధ్యంలో కొంత మార్పు వచ్చే అవకాశం ఉంది. నగర సుందరీకరణ మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

భారీగా అక్రమాలు

- డీసీసీబీలో ముగిసిన త్రిసభ్య కమిటీ విచారణ
- నేడో, రేపో కలెక్టర్‌కు చేరనున్న నివేదిక



ఒంగోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో అక్రమాలపై త్రిసభ్య కమిటీ చేపట్టిన విచారణ ముగిసింది. నేడోరేపో నివేదికను కలెక్టర్‌కు సమర్పించనుంది. విచారణలో అవాక్కయ్యే అనేక విషయాలు వెలుగుచూసినట్లు తెలుస్తోంది. గత వైసీపీ పాలనలో (2019-24) డీసీసీబీలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని పలువురు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ గతనెల తొలివారంలో మంత్రి అచ్చెన్నాయుడును లిఖితపూర్వకంగా కోరారు. విజిలెన్స్ విచారణకు మంత్రి ఆదేశించారు. దీంతో ఆ విభాగం రంగంలోకి దిగింది. అయితే అప్పటి వరకు బ్యాంకు సీఈవోగా ఉన్న కోటిరెడ్డి అదేస్థానంలో ఉంటే రికార్డుల తారుమారుకు అవకాశం ఉంటుంది కనుక ఆయన్ను ఆ బాధ్యతల నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ గతనెల 21న కలెక్టర్ అన్సారియాకు లేఖ రాశారు. ఆయా ఫిర్యాదులపై సెక్షన్ 51 విచారణకు ఆదేశించాలని కూడా అందులో ఆమె కోరారు.

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక

కలెక్టర్ లేఖ అనంతరం పదిరోజులు గడిచినా ఉన్నతస్థాయి అధికారుల నుంచి స్పందన కరువైంది. బ్యాంకు పీఐసీ కమిటీ కూడా పట్టించుకోలేదు. వీటన్నింటినీ బహిర్గతం చేస్తూ ఈనెల 2న 'ఆంధ్రజ్యోతి'లో 'అక్కడంతే' శీర్షికన కథనం ప్రచురితమవడంతో రాష్ట్రస్థాయిలో కదలిక వచ్చింది. అదే సమయంలో విషయం సీఎం దృష్టికి కూడా వెళ్లింది. సీఎంవో జోక్యం చేసుకోవడంతో రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు ఒకింత ఉలికిపాటుకు గురై దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో ఈనెల 5న బ్యాంకు ప్రస్తుత అధికారులతో కూడిన పాలకవర్గం సూచనలతో సీఈవో కోటిరెడ్డి రాజీనామా చేశారు. మరోవైపు ప్రాథమిక విచారణ చేపట్టి నివేదిస్తే తదనుగుణంగా సెక్షన్ 51 విచారణకు ఆదేశిస్తామన్న సంకేతాలు సహకార శాఖ ఉన్నతాధికారుల నుంచి కలెక్టర్‌కు అందాయి.

62 ఫిర్యాదులపై పదిరోజులు సాగిన విచారణ

మొత్తం 62 ఫిర్యాదులపై త్రిసభ్య కమిటీ విచారణ పదిరోజులు చేసింది. అందులో ఉద్యోగులకు వ్యక్తిగతంగా లబ్ధిచేకూరేలా ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు లేకపోవడం, కొందరి పట్ల అధికారులు వివక్ష చూపడం వంటి అంశాలతోపాటు బ్యాంకు బ్రాంచిల ఆధునికీకరణ, సామగ్రి, సీసీ కెమెరాల కొనుగోలు, లీగల్ చార్జీల చెల్లింపులు ఉన్నాయి. వీటితోపాటు పాలవెల్లువ, ఇతర రుణాల మంజూరులో అక్రమాలు, సెకండ్ హ్యాండ్ వాహనాలు కొని ఎంటీఎంలుగా వాడటం, కోర్టు కేసులలో ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల ప్రయోజనాలకు అనుగుణంగా బ్యాంకు అధికారులు వ్యవహరించడం వంటివి కూడా ఉన్నాయి. ఇలా మొత్తం 62 ఫిర్యాదులను తొమ్మిది భాగాలుగా చేసి త్రిసభ్య కమిటీ విచారించింది. ఇంచుమించు అన్ని అంశాల్లోనూ అక్రమాలు జరిగాయన్న భావనకు వచ్చినట్లు తెలుస్తోంది. అలా పది రోజులపాటు విచారణ నిర్వహించిన కమిటీ వాటన్నింటిని క్రోడీకరించి సోమ లేదా మంగళవారాల్లో కలెక్టర్‌కు ఆ నివేదికను అందించే అవకాశం ఉంది. దీంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలైంది.

కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి త్రిసభ్య కమిటీ

ఉన్నతాధికారుల సూచనతో డీసీసీబీపై విచారణకు డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి, ఎల్‌డీఎంలతో కూడిన త్రిసభ్య కమిటీని కలెక్టర్ అన్సారియా నియమించి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ కమిటీ ఈనెల 6వతేదీ నుంచి విచారణ ప్రారంభించింది. నిత్యం అనేక ఫిర్యాదులు కలెక్టర్‌కు వస్తుండటంతో వాటిని కూడా విచారించాలని ఎప్పటికప్పుడు కమిటీకి ఆమె పంపుతున్నారు. మరోవైపు బ్యాంకు అధికారులు, సిబ్బంది నుంచి అవసరమైన స్థాయిలో విచారణ కమిటీకి తొలుత సహకారం లభించలేదు. అనేక ఆటంకాలు కల్పించడంతోపాటు ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను బ్యాంకు సిబ్బంది కొందరు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ విచారణ కమిటీకి నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నిక్కచ్చిగా వ్యవహరించడంతో చివరకు ఆయా అంశాలకు సంబంధించిన ఫైళ్లను చూపడంతోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్యాంకు సిబ్బంది విచారణ కమిటీ ముందు వ్యక్తిగతంగా హాజరై వివరణలు ఇవ్వక తప్పలేదు.

నయా దంగల్

- చిన్నతనం నుంచి క్రీడలపై మక్కువ పెంచుకున్న తండ్రి
- బిడ్డల రూపంలో కల నెరవేర్చుకునేందుకు కృషి
- కుమార్తెల ఖర్చుల కోసం భార్యాభర్తలు పస్తులు
- ఆసాంతం నాన్న శిక్షణలోనే ఇద్దరూ కఠోర శ్రమ

7

దీపం పరబ్రహ్మ స్వరూపం



ప్రవచిస్తున్న చిన్నజీయర్‌స్వామి

- ప్రతి ఇంట్లో నిత్య దీపారాధన అవసరం
- అది హిందూ సనాతన ధర్మానికి ప్రతీక
- చిన్నజీయర్ స్వామి అనుగ్రహ భాషణ
- రామ పాదుకా పూజలో భారీగా పాల్గొన్న భక్తులు

ఒంగోలు (కల్చరల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మన ఇంట్లో కానీ, దేవాలయంలో కానీ వెలిగించే దీపం సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపమని త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. దీపం ఇంట్లో వెలిగిస్తే ఎటువంటి దోషాలు ఉన్నా పోయి లక్ష్మీదేవి కొలువుంటుందన్నారు. దేవాలయంలో వెలిగితే ఆ గ్రామం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. వికాస తరంగిణి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి నిర్వహించిన శ్రీరామపాదుకా పట్టాభిషేకం, పాదుకా పూజలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. శ్రీరాముడు ధర్మానికి ప్రతీక అని, ఆయన అడుగుజాడల్లో నడిచి భరతుడు రాజ్య పాలనా కాంక్ష లేకుండా రాముని పాదుకలను సింహాసనంపై ఉంచి పాలన చేశారన్నారు. అందుకే రామపాదుకలను పూజించిన వారికి శ్రీరాముని అనుగ్రహం కలుగుతుందన్నారు. కార్తీకమాసంలో దీపారాధన, వనభోజనం వంటివి సమాజానికి ఎంతో మేలు చేస్తాయని చిన్నజీయర్ స్వామి పేర్కొన్నారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించి భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు చిన్నతనం నుంచే తమ పిల్లలకు హిందూ సనాతన ధర్మం విశిష్టతను తెలియజేయాలని, హిందూ ధర్మాన్ని పాటించే వారు మంచి నడవడికను అలవాటు చేసుకుంటారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీరామ పాదుకా పూజలో పాల్గొన్న భక్తులకు చిన్నజీయర్ స్వామి స్వహస్తాలతో శ్రీరామ పాదుకలను అందజేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు తడికమళ్ల హరిప్రసాదరావు, పలు హిందూ ధర్మ సంఘాల నాయకులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బిడ్డ మృతదేహాన్ని చూసి విలపిస్తున్న కుటుంబ సభ్యులు

'తల్లి'డిల్లి...

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బిడ్డల దేహాలను చూసి కన్నీరుమున్నీరు
- కొప్పోలు వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న నీటి ట్రాక్టర్
- ముగ్గురు విద్యార్థుల దుర్మరణం
- వారిలో ఇద్దరు అన్నదమ్ములు
- ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం
- రిమ్స్ వద్ద మిన్నంటిన రోదనలు

రెండేళ్ల క్రితం భర్త చనిపోయాడు. కూలి పనులు చేసి ఇద్దరు కొడుకులను ఆమె కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. వారిని ఉన్నతస్థాయికి చేర్చాలని ఎన్నో కలలు కనింది. వారి భవిష్యత్తు గురించి ఆశల సౌధాలు కట్టుకుంది. అవి ఒక్కసారిగా కుప్పకూలాయి. ఆమె కలలు కన్నీటి సుడుల్లో కరిగిపోయాయి. నీటి ట్రాక్టర్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆ బిడ్డలను కబళించి ఆ తల్లికి కడుపుకోతను మిగిల్చింది. విగత జీవులుగా పడి ఉన్నవారిని చూసి అలుపెరగని శోకంతో తల్లడిల్లిపోయింది. "దేవుడా ఎంత పనిచేశావు.. అభం శుభం తెలియని నా బిడ్డలను ఎందుకు తీసుకెళ్లావు?" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్న ఆ తల్లిని సముదాయించడం ఎవరి వల్లా కాలేదు. కొప్పోలు అంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె ఇద్దరు కుమారులతోపాటు మరో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. చనిపోయిన ముగ్గురు కొప్పోలుకు చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఒంగోలు (క్రైం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర పరిధి కొప్పోలులోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వడ్డే బాలకోటేశ్వరి కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఆమె కుమారులు వికాస్ (14), విశాల్ అలియాస్ కుశాల్ (11). కొత్తపట్నంలోని సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ వికాస్ తొమ్మిదో తరగతి, విశాల్ ఆరో తరగతి చదువుతున్నారు. తన సమీప బంధువు గృహప్రవేశం కోసం శనివారం ఇంటికొచ్చారు. ఆ శుభకార్యానికి అందరిలాగేనే తన పిల్లలు కూడా కొత్త దుస్తులు వేసుకోవాలన్న తపనతో తల్లి డబ్బులు ఇచ్చి తెచ్చుకోమని చెప్పింది. వారి బంధువులైన కన్నెధార బుజ్జిబాబు, పుష్పాంజలి దంపతుల కుమారుడు రేష్మంత్ (16) ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. అతని చెల్లెలు పుట్టినరోజు వేడుకకు దుస్తులు కొనేందుకు వెళ్లాలనుకున్నాడు. రేష్మంత్‌తోపాటు వికాస్, విశాల్ ద్విచక్రవాహనంపై ఆదివారం ఒంగోలు వెళ్లి షాపింగ్ పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. కొప్పోలులోని ఆంజనేయస్వామి గుడి వద్దకు చేరుకునే సరికి వారు ప్రయాణిస్తున్న స్కూటీని వెనుక నుంచి వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ముగ్గురూ కిందపడిపోయారు. వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్ వెనుక చక్రం వారిపై నుంచి వెళ్లింది. స్కూటీని నడుపుతున్న రేష్మంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. వికాస్‌ను చికిత్స నిమిత్తం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచాడు. విశాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు.



ప్రమాదస్థలంలో మృతదేహాలు

ఇద్దరు బిడ్డలను పోగొట్టుకున్న తల్లి గర్భశోకం

భర్త బాలకోటయ్యను కోల్పోయిన బాలకోటేశ్వరి తన ఇద్దరు బిడ్డలే ప్రాణంగా బతుకుతోంది. ఆర్థిక స్థోమత లేక తన బిడ్డలను సంక్షేమ హాస్టల్‌లో ఉంచి చదివిస్తోంది. వారి భవిష్యత్తు కోసం కూలీనాలి చేసి పైసా పైసా కూడబెడుతోంది. ఒక్కసారిగా కుమారుల మృతి వార్త విని విలపిస్తూ ఒంగోలులోని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకెళ్లింది. తన బిడ్డల మృతదేహాలను చేతుల్లోకి తీసుకుంది. వారి బంగారు భవిష్యత్తు కోసం పడ్డ కష్టాన్ని తలుచుకుంటూ.. దుఃఖాన్ని మాటల్లో వెళ్లగక్కుతూ... తీరని బాధతో బోరున ఏడుస్తున్న ఆమెను చూసి అక్కడున్న వారందరి కళ్లు చమర్చారు. పిల్లలు ఇక లేరనే మాట మింగుడు పడక వారితో మాట్లాడుతూ ఉండటం చూసి ఆస్పత్రి వద్ద ఉన్న ప్రతి ఒక్కరూ కంట తడి పెట్టారు.



ముగ్గురు ప్రాణాలను బలిగొన్న ట్రాక్టర్

చెల్లికి దుస్తులు తెస్తానని వెళ్లి తిరిగిరాని లోకాలకు..

తన చెల్లి పుట్టినరోజు వేడుకకు కొత్త దుస్తులు తెస్తానని చెప్పి వెళ్లిన రేష్మంత్ రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకుంటాడానుకునేలోపే తిరిగి రాని లోకాలకు వెళ్లాడన్న వార్త విని అతని కుటుంబం కన్నీరు మున్నీరైంది. రేష్మంత్ తండ్రి బుజ్జిబాబు ఒంగోలు కార్పొరేషన్‌లోని వాటర్‌వర్క్స్ విభాగంలో పనిచేస్తూ పిల్లలను చదివించుకుంటున్నాడు. చేతికి అందివస్తున్న బిడ్డ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి పుష్పాంజలి, తండ్రి బుజ్జిబాబు తల్లడిల్లిపోతున్నారు.

కొప్పోలులో విషాదం

కొప్పోలు అంబేడ్కర్ నగర్‌లో ముగ్గురు బాలురు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలో అందరూ విషణ్ణ వదనాలతో కనిపించారు. వేడుక ఇంటి వద్ద ఉన్నవారంతా అక్కడ చేస్తున్న పనులను పక్కన పెట్టి ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి చేరారు. గ్రామంలో ఎక్కడ చూసినా బరువెక్కిన హృదయాలతో కంట తడి పెడుతున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం

ఒంగోలు నుంచి కొప్పోలుకి నీటి ట్యాంకర్‌తో వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. డ్రైవర్ స్థానిక జయప్రకాష్ కాలనీకి చెందిన ఎస్.శివప్రసాద్. అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలాన్ని ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ప్రభాకర్, తాలుకా సీఐ అజయ్‌కుమార్ పరిశీలించారు. చుట్టుపక్కల వారిని విచారించారు. ప్రమాదానికి కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తాలుకా ఎస్సై పావని కేసు నమోదు చేశారు.

ఇన్‌సెట్‌లో సత్తా చాటిన డాక్టర్ ప్రశాంత్



ఒంగోలు(కల్చరల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేవీ సివిలియన్ ఎంట్రన్స్ పరీక్ష (ఇన్‌సెట్-2024)లో ఒంగోలు ప్రభుత్వ వైద్యకళాశాల మెడికో డాక్టర్ గాజులపల్లి ప్రశాంత్ సత్తాచాటారు. ఆయన ఆల్ ఇండియాలో 294వ ర్యాంక్‌ను సాధించారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో నిష్ణాతులను ఎంపిక చేసి త్రివిధ దళాలలో సేవలు వినియోగించుకునేందుకు ఈ పరీక్షను నిర్వహిస్తారు. అటువంటి ప్రతిష్ఠాత్మకమైన పరీక్షలో ప్రశాంత్ ర్యాంకు సాధించటంపై వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు హర్షం వ్యక్తం చేశారు.

గ్రానైట్ లారీ సీజ్

మద్దిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గెలాక్సీ గ్రానైట్ రాళ్ల అక్రమంగా తరలిస్తున్న లారీని మద్దిపాడు పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. చీమకుర్తి నుంచి అక్రమంగా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు విజిలెన్స్ సీఐ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి ధృవపత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి మద్దిపాడు పోలీసులకు అప్పగించారు.

కాపులకు అన్నివేళలా అండగా ఉంటా

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కాపు కులస్థులకు ఎప్పుడూ అండగా ఉంటానని, వారి సంక్షేమం కోసం అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని డి6 ఎక్సోటికా ఫంక్షన్‌హాలులో కాపు సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దామచర్లకు కాపు సంఘ అధ్యక్షుడు కొక్కిరాల సంజీవరావు ఆధ్వర్యంలో సంఘ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఒంగోలులో కాపు సంక్షేమ భవనం ఏర్పాటు చేయాలని, వివిధ రాజకీయ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని వారు చేసిన విజ్ఞప్తికి దామచర్ల సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో కాపులు గౌరవప్రదంగా జీవించేందుకు తాను అన్నివిధాలుగా సహకరిస్తానని తెలిపారు. కాపు భవనానికి గతంలో తాను రూ.5 కోట్లు మంజూరు చేయించామని, త్వరలో అది పూర్తయ్యేందుకు కృషిచేస్తానని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. కాపులకు గతంలో చంద్రబాబు ప్రతిపాదించిన 5 శాతం రిజర్వేషన్ తప్పకుండా ఆచరణలోకి వస్తుందన్నారు. గత ప్రభుత్వంలో కాపులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, కాపు కమిటీ సభ్యులు తంజావూరు శ్రీనివాసమూర్తి, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, కొప్పోలు శ్రీనివాసరావు, బూదేరామ్ రాజ్‌కుమార్, మిరియాల వెంకటేశ్వర్లు, మేకల నారాయణ, తోటకూర చిన్నవెంకట్రావు, చిల్లర హనుమంతరావు, వడ్లమూడి శ్రీనివాసరావు, కాపు నాయకులు పాల్గొన్నారు.

మేదర సంఘం ఆధ్వర్యంలో

స్థానిక సదా రామనామ క్షేత్రంలో జరిగిన మేదర సంఘం కార్తీక వనభోజనాలలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేదర కులస్థులు ఐకమత్యంగా గత ఎన్నికలలో కూటమి అధికారంలోకి రావటానికి కృషి చేశారని, వారి సంక్షేమం కోసం తాను సహకరిస్తానని చెప్పారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

● సిబ్బందికి మంత్రి స్వామి సూచనలు

కొండపి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నూరు గ్రామంలోని పీడబ్ల్యూడీ చెరువు దగ్గర నుంచి కట్టుబడివారిపాలెం వైపు వెళ్లే రోడ్డులో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆదివారం రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పరిశీలించారు. గత టీడీపీ హయాంలో మంజూరై కొంతవరకు పనులు జరగ్గా తర్వాత వైసీపీ ప్రభుత్వంలో ఈ పని ఆగిపోయింది. తిరిగి రూ.23 లక్షలు మంజూరు కావడంతో హైలెవల్ బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులను పరిశీలించిన మంత్రి స్వామి పనుల పురోగతిని పీఆర్ ఏఈ బి. ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. ఆయన వెంట పొన్నలూరు మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామారావు, టీడీపీ నాయకుడు చాగంరెడ్డి నరసారెడ్డి పాల్గొన్నారు.

మంత్రి స్వామి పూజలు

సింగరాయకొండ: మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని చెల్లమ్మగారిపాలెంలో ఆదివారం అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. రాత్రికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. గ్రామస్థులు ఆయన్ను సాదారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సైకం చంద్రశేఖర్, నేతలు సందానీబాషా, సుదర్శి చంటి, రాజగోపాల్‌రెడ్డి, గాలి హరిబాబు, బ్రహ్మయ్య, పోతురాజు, మోటుపల్లి వెంకటేశ్వర్లు, యస్దాని, సనావుల్లా పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి

గ్రంథాలయాల ద్వారా అనంత విజ్ఞానం

● మెప్మా డీడీ రవికుమార్


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఒంగోలు(కల్చరల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఎంతో విజ్ఞానాన్ని పొందాలని మెప్మా డిప్యూటీ డైరెక్టర్ టి.రవికుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చిన్న వయసులోనే గ్రంథాలయాకు వెళ్లటం అలవాటు చేసుకోవాలని, స్వాతంత్ర ఉద్యమంలో ఇవి ప్రముఖ పాత్ర పోషించాయని ఆయన చెప్పారు. డైట్ ప్రిన్సిపాల్ సామ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. మరో అతిథి సాల్మన్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి గ్రంథాలయం సభ్యత్వం తీసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. గ్రంథాలయ కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికోసం ఎన్నో పుస్తకాలు లభిస్తున్నాయని చెప్పారు. డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల కోసం క్విజ్, వక్తృత్వ, డాన్స్ పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అతిథులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించగా డీఆర్ఎం స్కూల్ ఉపాధ్యాయులు సీహెచ్.గౌరీకుమారి, ఎస్.శ్రీనివాసులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

మహిళా గ్రంథాలయంలో

నగరంలోని హెడ్ పోస్టాఫీసు సమీపంలోని మహిళా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. గ్రంథ పాలకురాలు టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య పాల్గొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదు

● ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఆశించినంత జరగలేదని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పార్టీలకు అతీతంగా సహకరించుకోవాలన్నారు. మర్రిపూడి చెరువు కట్ట కింద కోనేరుల వద్ద ప్రమాదాల నివారణకు ఆర్‌అండ్‌బీ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. చిలంకూరులో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లను సరి చేయాలని జడ్పీటీసీ సభ్యురాలు మాకినేని సుధావెంకట్రావు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి పద్మశ్రీ, తహసీల్దార్ నరసింహం, ఎంపీడీవో జగదీష్, ఎంఈవో రంగయ్య, ఏఈ జాలయ్య, ఏపీవో రాంబాబు, ఏఈ జయపాల్, వైద్యాధికారులు విద్యాసాగర్, తేజ, ఏఈలు విశ్వనాథం, నరేంద్ర భూపతి, ఎస్.జాలయ్య ఏవో వెంకటేష్, సర్పంచ్‌లు కదిరి భాస్కర్, ముప్పరాజు సుబ్బయ్య, శీలం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు చిరంజీవి, శ్రావణి పాల్గొన్నారు.

గ్రానైట్ గనుల్లో భద్రతపై దృష్టి సారించాలి

● డీజీఎంఎస్ ఉజ్వల్‌థా


క్వారీలను పరిశీలిస్తున్న డీజీఎంఎస్, అధికారులు

చీమకుర్తి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రానైట్ గనుల్లో పటిష్ఠమైన భద్రతా చర్యలను యజమానులు చేపట్టాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉజ్వల్‌థా సూచించారు. ఆదివారం రామతీర్థం పరిసరప్రాంతంలోని ఆనంద్ గ్రానైట్ క్వారీతోపాటు పలు క్వారీలను సందర్శించారు. క్వారీ పిట్‌లోకి వెళ్లి మరీ క్వారీయింగ్ ప్రక్రియను ఆసక్తిగా పరిశీలించారు. బెంచ్, వైర్సా కటింగ్‌లను దగ్గరుండి తిలకించారు. ఇటీవల క్వారీల్లో చోటుచేసుకున్న ప్రమాదాలను, వాటికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భద్రతా ప్రమాణాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్‌సింగ్, డీఎంఎస్ సుప్రియే చక్రవర్తి, డీడీఎంఎస్ జ్ఞానేశ్వర్, ఓనర్లు చలువాది బదరీనారాయణ, ఆర్‌పీ రవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చాంపియన్‌షిప్ పోటీలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఒంగోలులో ఉత్సాహభరితంగా జరిగాయి. జిల్లా ఆర్గనైజింగ్ చైర్మన్ వి.మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలో 15 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా టీడీపీ న్యాయ విభాగం అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ సుబ్బారావులు హాజరై ప్రసంగించారు. క్రీడాకారులు గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలని సూచించారు.

ఘనంగా ఆర్ట్ క్రాఫ్ట్ ఫెస్ట్

ఒంగోలు(కల్చరల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నేచర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు నగరం అంజయ్యరోడ్‌లోని ఏకేవీకే కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఫెస్ట్-2024 ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్, క్లాసికల్ డాన్స్‌లలో పోటీలు జరిగాయి. డ్రాయింగ్ కాంపిటీషన్‌లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల నుంచి 221 మంది, క్లాసికల్ డాన్స్‌లో 25 మంది, క్రాఫ్ట్‌లో 32 మంది, పబ్లిక్ స్పీకింగ్ కాంటెస్ట్‌లో 15 మంది పాల్గొన్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు దరిమడుగు రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వర్లు, మాల్యాద్రి నాయుడు, కసిబిసి నాగేశ్వరరావు, డాక్టర్ జి.రవి, తన్నీరు సురేష్, ఉప్పుటూరి వెంకట్, సురేష్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

మద్దిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం గుండ్లాపల్లి సమీపంలో జరిగింది. మార్టూరుకు చెందిన పతంగుల గణేష్, పతంగుల సాయికిరణ్‌లు ఒంగోలులోని ఓ శుభకార్యానికి వెళ్లి తమ స్వగ్రామం వెళ్లే క్రమంలో మోటార్‌సైకిల్‌కు కుక్క అడ్డుగా రావటంతో దానిని ఢీకొని కిందపడ్డారు. దీంతో వారికి గాయాలు కాగా వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

చేకూరపాడు సమీపంలో

నాగులుప్పలపాడు: రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన చేకూరపాడు సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. అందిన వివరాల మేరకు, ఒంగోలుకు చెందిన ఇద్దరు యువకులు ప్రయాణిస్తున్న బైక్ ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనగా ఇరువురికి గాయాలయ్యాయి.

మద్దాలికి పురస్కారాల ప్రదానం

ఒంగోలు(కల్చరల్), నవంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావును బాలల దినోత్సవం సందర్భంగా ఎల్‌సీఈఎస్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పలు పురస్కారాలతో సత్కరించారు. ఒంగోలు నగరం మల్లయ్యలింగంభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు జవహర్‌లాల్ నెహ్రూ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు, నీలం సంజీవరెడ్డి స్ఫూర్తి సేవ పురస్కారంను సినీ గేయ రచయిత డాక్టర్ మధురశ్రీ, సినీ, టీవీ ఆర్టిస్ట్ ఆదినారాయణ, గాయకురాలు సుహాసిని, కె.విజయలక్ష్మి చేతులమీదుగా అందజేశారు.

ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా పోరాడాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్న ఆర్థిక భారాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్యభవన్‌లో ఆదివారం నగర మహాసభ జరిగింది. కార్యక్రమంలో జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, స్వామి, ఎస్‌డీ.హుస్సేన్, తంగిరాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడితుల పక్షాన ఉన్నందుకే సాయిబాబాపై అక్రమ కేసులు

● విరసం నేత కళ్యాణ్‌రావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పీడిత ప్రజల పక్షాన నిలిచినందుకే ప్రొఫెసర్ సాయిబాబాపై అక్రమంగా కేసు పెట్టి జైలులో నిర్బంధించారని విరసం సీనియర్ నాయకుడు జి.కళ్యాణ్‌రావు ఆరోపించారు. ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభకు జిల్లా కన్వీనర్ ఎ.వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కళ్యాణ్‌రావు మాట్లాడుతూ ఆదివాసీయులపై కేంద్రప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభించినప్పుడు అడ్డుకోవడంతో సాయిబాబా కీలకంగా పనిచేశారన్నారు. అందుకే ఆయనను పదేళ్ల పాటు జైలులో నిర్బంధించారని ఆరోపించారు. సాయిబాబా మృతి ప్రభుత్వాలు, న్యాయస్థానాలు చేసిన హత్యగా భావించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకయ్య, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, వై.వెంకటేశ్వర్లు, కోటి, జార్జ్, కొంగర నరసింహం, ఈద శ్రీనివాసరావు, ఉటుకూరి వెంకటేశ్వర్లు, చుండూరి రంగారావు, కాలేషాబేగ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళ్యాణ్‌రావు

పేదల భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

● రజక వృత్తిదారుల సంఘం డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పేదల భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని రజకవృత్తిదారుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రాయల మాలకొండయ్య కోరారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం రజకవృత్తిదారుల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాచకొండ కృష్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ హనుమంతునిపాడు మండలం నారాయణపల్లికి చెందిన బెల్లంకొండ అంకమ్మకు 74/3లో మూడు ఎకరాలు, కనిగిరి మండలం వెంకటేశ్వరపురంలో సీమలదిన్నె నారాయణ భూమి 2.66 ఎకరాల భూమి ఆక్రమణలకు గురైందన్నారు. దీనిపై జిల్లా సంఘం జోక్యం చేసుకోవడంతో పోలీస్, రెవెన్యూ అధికారులు రీసర్వే చేసి భూమిని బాధితులకు అప్పగించారన్నారు. చేతివృత్తిదారుల సంఘం కార్యదర్శి తోట తిరుమలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక విధానం పట్టణ ప్రాంతాలకే పరిమితమైందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు, ఇంటి యజమానులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్.కొండయ్య, కోటేశ్వరరావు, పోలయ్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రాహ్మణ సమారాధన


పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

మద్దిపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మల్లవరం శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రాంగణంలోని బ్రాహ్మణ అన్నదాన సత్రంలో ఆదివారం బ్రాహ్మణ కార్తీక సమారాధన వైభవంగా జరిగింది. ముందుగా వేదపండితులు గణపతి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘ నాయకులు మాట్లాడుతూ ఐకమత్యంగా ముందుకు సాగాలని, పేద బ్రాహ్మణులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది.

రేపు మాజీ సైనికుల సదస్సు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ ఇంజనీర్ గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో మాజీసైనికులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి రజనీకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్రాస్ గ్రూప్‌కు చెందిన మాజీ సైనికులు, వితంతువులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఇతర రెజిమెంట్లకు చెందిన మాజీ సైనికులు కూడా పాల్గొని పెన్షన్ తదితర సమస్యలకు పరిష్కారం పొందవచ్చువని, జిల్లాలోని మాజీసైనికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంకేపల్లి రేషన్ దుకాణంపై దాడి

మర్రిపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకేపల్లి చౌకధరల దుకాణంపై ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు ఆదివారం ఆకస్మికంగా దాడి చేశారు. రికార్డుల ప్రకారం 850 కిలోల బియ్యం ఉండాల్సి ఉండగా 650 కిలోల బియ్యం మాత్రమే ఉన్నాయని 200 కేజీల బియ్యం తక్కువగా ఉన్నాయని డీటీ సురేఖ చెప్పారు. 6ఏ కింద కేసు నమోదు చేశారు. బియ్యాన్ని వీఆర్‌ఏ సీతారామయ్యకు అందజేశామని చెప్పారు. ఎఫ్ఐ ప్రమోద్ పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీపై కేసు నమోదు

చీమకుర్తి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం సమీపంలో ఉన్న గోల్డెన్ గ్రానైట్ క్వారీ లీజుదారులపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు చీమకుర్తి సీఐ సుబ్బారావు తెలిపారు. దిగుమర్తి సురేష్ అనే వ్యక్తి గోల్డెన్ గ్రానైట్‌లో చోటుచేసుకున్న వ్యవహారాలు, దాని వలన ప్రభుత్వానికి కలిగిన నష్టం తెలియజేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒంగోలు కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనికనుగుణంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని కోర్టు చీమకుర్తి ఎస్‌హెచ్‌వోకు రిఫరల్ ఆర్డర్ జారీ చేయటంతో సంబంధిత అధికారులు, లీజుదారులు, సబ్‌లీజుదారులు మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బారావు ఆదివారం తెలిపారు. తదుపరి కోర్టు ఉత్తర్వుల మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కోర్టుకు నివేదిస్తామని ఆయన చెప్పారు.

ఎమ్మెల్యే బీఎన్‌కు సత్కారం


ఎమ్మెల్యే విజయకుమార్‌ను సత్కరిస్తున్న మాజీ సైనిక సంఘ ప్రతినిధులు

సంతనూతలపాడు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను ఆదివారం ఒంగోలులోని ఆయన నివాసంలో ఏపీ డిఫెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు నెప్పలి నాగేశ్వరరావు, మాజీ సైనిక సంఘ ప్రతినిధి చుండూరి శ్రీరామ్మూర్తి ఘనంగా సత్కరించారు. దొనకొండలో డిఫెన్స్ మెటీరియల్ తయారు చేసే విధానంపై వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు మన్నంప్రసాద్, డిఫెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్య సమారాధన


పూజలో పాల్గొన్న దంపతులు

సంతనూతలపాడు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని ఆర్యవైశ్య మందిరంలో ఆదివారం కార్తీక వనసమారాధన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. అర్చకులు గూడా శివరామక్రిష్ణ, సాయిరాం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడుకు ఘన నివాళి

సంతనూతలపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామూర్తినాయుడు మృతి చెందిన క్రమంలో సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు ముప్పరాజు శ్రీను, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.సుబ్బారావు, బోస్, నాగార్జున, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

126 మందికి వైద్యపరీక్షలు

నాగులుప్పలపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఈదుమూడి గ్రామంలో ఆదివారం మన ఊరు-మన ఈదుమూడి సేవా సంస్థ వ్యవస్థాపకులు కావూరి వాసు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు శ్రీరామ్ మల్టీస్పెషాలిటీ వైద్యశాల వైద్యులు 126మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులు అందించారు. వైద్యశాల మేనేజర్ ఖాసింసైదా ఎస్.నాగరాజు, జి.పున్నయ్య, చిరంజీవి, శ్యాంకు మార్, మేడా బ్రహ్మయ్య, ఉప్పల వెంకట్రామయ్య, ప్రసాదు, వీరాంజనేయులు పాల్గొన్నారు.


పరుగుపందెంలో సాధించిన పథకాలతో రంగఝాన్సీ చౌదరి

“ఒలింపిక్స్ రెజ్లింగ్ విభాగంలో బంగారు పతకం తేవాలని అతని కల. తను సాధించలేకపోయిన పతకాన్ని తన బిడ్డలైనా దక్కించుకోవాలని తపన పడతాడు. అయితే తనకు వరుసగా ముగ్గురు కుమార్తెలు పుట్టడంతో తొలుత నిరాశ చెంది తరువాత వారిపైనే ఆశలు పెట్టుకుంటాడు. తొలి ఇద్దరు ఆడపిల్లలకు రెజ్లింగ్‌లో శిక్షణ ఇస్తాడు. తండ్రి కలను నెరవేర్చేందుకు వారు కూడా అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటారు. ఒకరు బంగారు పతకం సాధించి తండ్రి కలను నెరవేరుస్తారు”- ఇది ప్రముఖ ఇండియన్ రెజ్లర్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత మహవీర్‌సింగ్ ఫొగాట్ జీవిత చరిత్ర. దంగల్ సినిమాలో ఆ రెజ్లర్ల పోరాట పటిమ ఎంతో స్ఫూర్తివంతంగా మన కళ్లకు కడుతుంది. అచ్చం అలాంటి దంగల్ కుటుంబం మన జిల్లాలోనూ ఉంది. ఆట వేరైనా తీరు ఒకటే. తను సాధించలేకపోయిన విజయాలను తన బిడ్డలు దక్కించుకుని తీరాలని తండ్రి తలచాడు. వారికి తనే గురువు అయ్యాడు. కఠోర సాధన చేయించాడు. తండ్రి కలనే తమ కలగా భావించారు ఆ ఇద్దరు కుమార్తెలు. పేదరికాన్ని లెక్కచేయకుండా పట్టుదలతో కృషి చేశారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక పతకాలు సాధించి నాన్న కలను నెరవేర్చిన విజేతలుగా నిలిచారు. ఎంతో స్ఫూర్తిదాయకమైన ఆ ఇద్దరు అక్కా చెల్లెళ్ల జర్నీపై ప్రత్యేక కథనం...


జిమ్నాస్టిక్స్‌లో సాధించిన పథకంతో రంగజయ చౌదరి

నయా దంగల్

- చిన్నతనం నుంచి క్రీడలపై మక్కువ పెంచుకున్న తండ్రి
- బిడ్డల ద్వారా కలలను నెరవేర్చుకునేందుకు తపన
- కుమార్తెల ఖర్చుల కోసం తల్లిదండ్రుల పస్తులు
- ఆసాంతం నాన్న శిక్షణలోనే ఇద్దరూ కఠోర శ్రమ

రాష్ట్ర, జాతీయ స్థాయిలో వందకుపైగా పతకాలు సొంతం

తండ్రి కల నెరవేర్చేందుకు ఇద్దరు అక్కా చెల్లెళ్ల క్రీడా సవారీ

పరుగు పందెంలో అక్క. జిమ్నాస్టిక్స్‌లో చెల్లెలు పతకాల పంట

కంభం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం పెద్దనల్లకాల్వ గ్రామానికి చెందిన బొట్టా రంగనాయకులు చౌదరి నిరుపేద. ఎటువంటి ఆస్తిపాస్తులూ లేవు. ఆయన భార్య గాలెమ్మ గతంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసేది. రంగనాయకులకు క్రీడలంటే అమితమైన ఆసక్తి. చదువుకుంటూనే స్కూలు, కాలేజీ రోజుల్లో పలు పోటీల్లో పతకాలు సాధించాడు. కానీ పేదరికం వల్ల శరీర సౌష్ఠవానికి అవసరమైన ఆహారం, క్రీడా పరికరాలు తదితర ఖర్చులు భరించే శక్తిలేక ముందుకెళ్లలేకపోయారు. తన బిడ్డలనైనా క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆయన సంకల్పించారు. ముగ్గురు కుమార్తెలు జన్మించారు. తొలుత సంశయించినా తరువాత తన కుమార్తెలను క్రీడల్లో మెరికల్లా తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. ఆర్థిక స్థితి బాగాలేకున్నా, ఎవరి సహకారమూ అందకున్నా వెనుకడుగు వేయలేదు. రెండో కుమార్తె రంగఝాన్సీ చౌదరి, మూడో కుమార్తె రంగజయ చౌదరిలకు చిన్నతనం నుంచే ఆటల్లో శిక్షణ ఇచ్చారు.



గోల్డ్‌మెడల్ సాధించిన రంగజయ చౌదరి

పస్తులుండి కుమార్తెలకు ఖర్చు పెట్టి..

రంగనాయకులు తొలుత ఐసీఐసీఐ ఇన్సూరెన్స్ కంపెనీలో, రిలయన్స్ ఇన్సూరెన్స్‌లో సేల్స్ మేనేజర్ పనిచేశారు. అప్పట్లో నెలకు రూ.15వేలు మాత్రమే వచ్చేవి. ఉద్యోగం వల్ల కుమార్తెలకు శిక్షణ ఇచ్చేందుకు సమయం సరిపోయేది కాదు. దీంతో ఉద్యోగం మానేసి పూర్తి సమయం వారికే కేటాయించారు. తన భార్య జీతంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తూ ఉండేవారు. దంపతులు పస్తులుండి ఖర్చు తగ్గించుకుని కుమార్తెలకు ఆహారం, శిక్షణపైనే ఖర్చు పెట్టేవారు. తండ్రే గురువుగా శిక్షణ ఇచ్చేవారు. పెద్ద కుమార్తె రంగఝాన్సీ చౌదరికి అథ్లెటిక్స్ (400 మీటర్ల పరుగు)లో, రెండో కుమార్తె రంగజయ చౌదరికి జిమ్నాస్టిక్స్‌లో చిన్నప్పటి నుంచి తర్ఫీదు ఇవ్వడంతో ఇద్దరూ ఆయా పోటీల్లో రాణించారు. ఒకరు కడప, మరొకరు సికింద్రబాద్ స్పోర్ట్స్ స్కూలులో విద్యాభ్యాసం చేస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఇప్పటివరకు 100కుపైగా పతకాలు సాధించారు. 2036లో మన దేశంలో ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం సహకరిస్తే ఒలింపిక్స్‌లో నా కుమార్తెలు పతకాలు సాధిస్తారని కోచ్, తండ్రి బొట్టా రంగనాయకులు చెప్పారు.

పతకాల పరుగులో రంగఝాన్సీ



రంగఝాన్సీ చౌదరి తొలుత వంద మీటర్ల రన్నింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. అథ్లెటిక్స్‌లో మొత్తం 65 పతకాలు సాధిస్తే అందులో 4 జాతీయ పతకాలున్నాయి. చంద్రబాబునాయుడు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన గాండీవ ప్రాజెక్టుకు కూడా ఆమె ఎంపికైంది. పరుగుల రాణి పీటీ ఉషా నుంచి ప్రశంశలు అందుకోవడమేకాక జిల్లాలో ఉగాది పురష్కారం సందర్భంగా అవార్డు అందుకుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరులో ఐసీఐసీఐ బ్యాంక్‌లో పని చేస్తోంది.

జిమ్నాస్టిక్స్‌లో రంగజయ అదుర్స్



చెల్లెలు రంగజయచౌదరి జిమ్నాస్టిక్స్‌లో 35 రాష్ట్రస్థాయి పతకాలు సాధించింది. 4 పర్యాయాలు ఏపీ ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్‌గా నిలిచింది. సౌత్‌జోన్ జాతీయస్థాయిలో 3 పతకాలు సాధించి ఆల్ రౌండర్ చాంపియన్‌గా నిలిచింది.

అక్క స్ఫూర్తితో పతకాలు సాధించా..



నా చిన్నప్పటి నుంచి అక్క రంగఝాన్సీ చౌదరి స్పోర్ట్స్ స్కూల్‌కు వెలుతుండేది. ఆమెను చూసి నాకు కూడా ఆటలపై ఇష్టం పెరిగింది. స్పోర్ట్స్ స్కూలులో చేరి నేను కూడా మెడల్స్ సాధిస్తానని చెప్పగానే మా నాన్న నా ఇష్టాన్ని గుర్తించి శిక్షణ ఇచ్చి స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్చారు. అందులో జిమ్నాస్టిక్స్‌పై ఆసక్తితో 35కు పైగా మెడల్స్ దక్కించుకున్నాను. రాష్ట్రంలో ఆల్ రౌండర్ చాంపియన్‌షిప్ సాధించాను.

- రంగజయ చౌదరి

అమ్మ, నాన్నల కష్టం చూసి పట్టుదల పెరిగింది



నాకు అథ్లెటిక్స్ పరుగు పందెంలో చిన్నప్పటి నుంచి శిక్షణ ఇచ్చింది మా నాన్నే. నన్ను క్రీడల్లో ప్రోత్సహించేందుకు స్పాన్సర్లు ఎవరూ ముందుకు రాలేదు. అయినా నిరుత్సాహ పడకుండా మా అమ్మ, నాన్న ఎంతో కష్టపడ్డారు. వారి కష్టం చూసి నాలో పట్టుదల పెరిగింది. కఠోర శ్రమ చేశా. 65కు పైగా పతకాలు సాధించా. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని నాన్న కలను నెరవేర్చా. అవకాశం వస్తే దేశం తరుపున పోరాడతా.

- రంగఝాన్సీ చౌదరి



కబడ్డీ జట్టుకు ఎంపికైన మహిళా క్రీడాకారులు

జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

ఒంగోలు విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూపు కళాశాలలో జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సెంట్రల్ జోన్ మహిళా కబడ్డీ ఇంటర్ కాలిజాట్, సెలక్షన్ ఎంపిక ఆదివారంతో ముగిసింది. ఫైనల్స్‌లో యూనివర్శిటీ తరుపున ఆడేందుకు 12 మంది క్రీడాకారులను క్రీడల కార్యదర్శి జి.శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఫైనల్ రౌండ్‌లో గెలుపొంది యూనివర్శిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను రైజ్ కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు, ఫిజికల్ డైరెక్టర్ హిమచంద్రబాబు, గౌరవ ఛైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, ట్రెజరర్ శిద్దా భరత్, రాగ చీఫ్ కో ఆర్డినేటర్ శిద్దా ప్రవల్లిక ప్రత్యేకంగా అభినందించారు.

వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

ఒంగోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాపట్ల బ్రహ్మయ్యపై సస్పెన్షన్ వేటుపడింది. వివరాల్లోకి వెళ్తే.. పాతసింగరాయకొండకు చెందిన బ్రహ్మయ్య బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఈ ఏడాది జూలైలో వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి బదిలీపై వచ్చారు. మండలంలోని కనుమళ్ల గ్రామానికి చెందిన కాట్రగడ్డ అనిల్‌కుమార్ సింగరకొండ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.8 లక్షల నగదును బ్రహ్మయ్యకు అందజేశారు. ఆ నగదును ఆలయంలో జమచేయకుండా బ్రహ్మయ్య స్వాహా చేశాడు. విషయం తెలుసుకున్న అనిల్ పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఈవో కృష్ణవేణికి ఫిర్యాదు చేశారు. దీనిపై బ్రహ్మయ్య నుంచి ఈవో వివరణ తీసుకున్నారు. తదుపరి నివేదికను జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్‌కు నివేదికను పంపారు. వారి ఆదేశాల ప్రకారం నగదును సింగరకొండ ఆలయంలో జమచేయనందుకు, పాతసింగరాయకొండ ఆలయంలో ముందస్తు అనుమతి లేకుండా నిర్లక్ష్యంతో విధులకు హాజరుకానందున బ్రహ్మయ్యను సస్పెన్షన్ చేస్తూ ఈవో కృష్ణవేణి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

28న మార్కాపురంలో మెగా జాబ్ మేళా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ యువనేత, పారిశ్రామికవేత్త మాగుంట రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నిరుద్యోగ యువత కోసం మార్కాపురంలోని సౌజన్య కన్వెన్షన్ హాలులో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. సుమారు ఐదువేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీతోపాటు బీటెక్, బీఈ, ఎంబీఏ, ఎంసీఏ, బి.ఫార్మశీ 2020-24 బ్యాచ్ విద్యార్థులకు ఈ జాబ్‌మేళాలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. వివరాలకు 97037 68078, 88865 03632 సెల్ నెంబర్లలో సంప్రదించాలని రాఘవరెడ్డి కోరారు.

నేడు, రేపు ఉపాధ్యాయులకు శిక్షణ

ఒంగోలు విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎంపిక చేసిన 22 పాఠశాలల్లో 8, 9, 11 తరగతులకు కెరీర్ ఎడ్యుకేషన్ బోధించే ఉపాధ్యాయులకు సోమ, మంగళవారాల్లో ఒంగోలులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రిఫ్రెషర్ శిక్షణను ఇస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు 8వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు, మంగళవారం 9,11 తరగతుల ఉపాధ్యాయులకు ఉదయం 9 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వారిని రిలీవ్ చేసి శిక్షణకు పంపాలని ఆయన కోరారు.



విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుల్లాయిస్వామి డిమాండ్
- రేపు పొదిలిలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుల్లాయిస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 19వ తేదీన పొదిలిలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా 20వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27 నుంచి నాలుగు రోజుల పాటు విజయనగరంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభల్లో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమలో సభ్యులు ఆంజనేయులు, పవన్‌కుమార్, కార్తీక్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

- రూ.62,790 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం

మార్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అలుగు వీధిలోని ఓ గృహంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.62,790 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు స్థానిక 8వ వార్డు పరిధిలోని అలుగువీధిలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సిబ్బందితో కలిసి ఆ గృహంపై దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

ఏలూరులో 10 బైకులు సీజ్

పొదిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పొదిలి పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా 10 మోటార్ బైకులను సీజ్ చేశారు. పదిమంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వేమన తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


పరుగు పందెంలో పాల్గొన్న పోలీసులు


మెడల్, ప్రశంసాపత్రాలతో విజేతలు, పక్కన ఎస్పీ, ఇతర పోలీసులు


వాలీబాల్ ఆడుతూ ఎస్పీ

ఉత్సాహంగా సాగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్

విజేతలకు బహుమతులను అందజేసిన ఎస్పీ

ఒంగోలు(క్రైం), నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పోలీస్ పరేడ్ మైదానంలో జరుగుతున్న జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ ఆదివారం రాత్రితో ముగిసింది. రెండు రోజులు జరిగిన పోటీల్లో నాలుగు సబ్‌డివిజన్ల జట్లతో పాటు ఏఆర్ జట్టు పాల్గొంది. ఉల్లాసకరమైన వాతావరణంలో పోలీసుల ఆటల పోటీలు జరిగాయి. రాత్రి పొద్దుపోయే వరకు ఈ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి పతకాలు, ట్రోఫీలు, సర్టిఫికెట్లను ఎస్పీ దామోదర్ అందజేశారు. వాలీబాల్ ఫైనల్ ఎంతో ఆసక్తిగా జరిగింది. క్రీడాకారులు క్లోసింగ్ మార్చ్ చేసి ఎస్పీకి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఎస్బీ డీఎస్పీ సురేష్‌బాబు, డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, నాగరాజు, లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన మైన్స్ భద్రతా వారోత్సవాలు


వారోత్సవాల ముగింపులో పాల్గొన్న గ్రానైట్‌క్వారీ యజమానులు

ఒంగోలు(క్రైం), నవంబరు17 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్, మైన్స్ భద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి ఒంగోలులోని ఏ1 ఫంక్షన్ హాలులో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ జోనల్ ఛైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్ హాజరయ్యారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన గ్రానైట్ క్వారీల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్ ఉజ్వల్‌థా మాట్లాడుతూ క్వారీలు, మైన్స్ తవ్వకాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ జోన్ మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ భూషణ్‌ప్రసాద్‌సింగ్, రీజియన్ డైరెక్టర్ సుప్రియాచక్రవర్తి, జిల్లా మైనింగ్ అధికారి టి.రాజశేఖర్, సేఫ్టీ వీక్ కన్వీనర్ కె.జ్ఞానేశ్వర్, జీవీటీసీ ఛైర్మన్ ఆర్.లక్ష్మీనారాయణ, చలువాది బదరీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు పాత వస్తువుల అమ్మకానికి వేలం

● మార్కాపురం మద్యం డిపో మేనేజర్ రాధాకృష్ణ

మార్కాపురం రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లిక్కర్ డిపో పరిధిలో ఇటీవల వరకు నడిచిన ప్రభుత్వ మద్యం దుకాణాలలో వినియోగించిన 101 ఫ్రీజర్‌లు, 101 ఇన్‌వర్టర్ కం బ్యాటరీలు, 98 క్యాష్ చెస్ట్‌లు, 148 స్కానర్‌లు, 134 క్యాష్ కౌంటిగ్ యంత్రాల అమ్మకానికి ఈ నెల 19న వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో ఫ్రీజర్‌కు రూ.22,680, ఒక్కో ఇన్‌వర్టర్‌కు రూ.18,630 క్యాష్ చెస్ట్ ఒక్కో దానికి రూ.6,120 ఒక్కో స్కానర్‌కు రూ.3400 రూపాయలు, క్యాష్ కౌంటింగ్ యంత్రానికి రూ.810 ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. వీటికి అదనంగా 18 శాతం పన్ను చెల్లించాలన్నారు. డిపో గోడౌన్‌లో ఈ నెల 19న మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5000 డిపాజిట్ చెల్లించాలన్నారు.

పర్యాటక కేంద్రంగా కంభం చెరువు

- ఏపీటీడీసీ డైరెక్టర్ గంట స్వరూపదేవి
- కంభంలో బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన



మాట్లాడుతున్న గంటా స్వరూపాదేవి

కంభం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చారిత్రాత్మక కంభం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తాను పూర్తి బాధ్యత తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట స్వరూపదేవి హామీ ఇచ్చారు. ఆదివారం మధ్యాహ్నం చెరువుకట్ట మీద శ్రీకృష్ణదేవ రాయ బలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బలిజల కార్తీక వనభోజన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంభం చెరువును చూస్తుంటే గోదావరి పాపికొండలు గుర్తుకు వస్తున్నాయన్నారు. దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం వారికి ఎన్నో ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి తదితరుల సహకారంతో వచ్చే వనభోజనాల కార్యక్రమం నాటికి ఒక కొలిక్కి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. కంభం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనేది ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అన్నారు. దీన్ని తాము అర్థం చేసుకున్నామన్నారు. బలిజ సంఘం అధ్యక్షులు తోట కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ కుప్పా రంగ నాయకులు, అర్ధవీడు మండల అధ్యక్షులు మేడూరి వెంకటరావు, బేస్తవారపేట మండల అభివృద్ధి అధికారి ఆకుల వెంకట రంగ నాయకులు, కొమరోలు పంచాయతీ ఈవో దేవరశెట్టి బ్రహ్మయ్య కంభం మండల టీడీపీ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు, గిద్దలూరు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు తోట మహాలక్ష్మి, ఇంకా కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, బలిజ సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కందుల నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు



పొదిలిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పొదిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పుట్టినరోజును టీడీపీ మండల నాయకులు కార్యకర్తలు ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఇమాంమ్‌సా, బెల్లంకొండ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో పట్టణంలోని విశ్వనాథపురం, పెద్దబస్టాండ్, అమ్మవారిశాల సమీపంలో, బెల్లంకొండ నగర్‌లలో కేక్‌లు ఏర్పాటు చేశారు. వందలాది మంది టీడీపీ కార్యకర్తలు, నాయకుల మధ్య కేక్‌లు కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు.



కందులకు శుభాకాంక్షలు తెలిపిన నేతలతో అనిల్

పొదిలి : మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డికి టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనీల్ (పండు) విజయవాడలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలో ఉన్న నారాయణ రెడ్డికి అక్కడికి వెళ్ళి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పొదిలి పట్టణంలో పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ వైద్య శాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణి చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పొదిలి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు పనులను ప్రారంభించాలి

సీపీఎం పొదిలి ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బాలనరసయ్య

పొదిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నిలిచిపోయిన పొదిలి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు పనులు ప్రారంభించాలని సీపీఎం పొదిలి ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బాలనరసయ్య అన్నారు. దర్శి నుంచి పొదిలి పెద్దచెరువుకు పైపులైన్‌ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే కొంతమేర పనులు చేసి జగన్ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. దీంతో పనులు నిలిపివేశారు. ఆ పనులను కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని పనులు పూర్తిచేసి నీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన కోరారు. పొదిలి ప్రాంత ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సమ్మర్ స్టోరేజ్ పూర్తి చేయడం ద్వారా మండలంలో చాలావరకు నీటి సమస్య తీరుతుందన్నారు. గత వైసీపీ పనులు ప్రారంభించి మధ్యలో చేతులెత్తేసిందన్నారు. కనుక కూటమి ప్రభుత్వం నిలిచిన పనులకు అవసరమైన నిధులు కేటాయించి పనులు ప్రారంభించి మండల ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. నగర పంచాయతీగా మారినా పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు నోచుకో లేదన్నారు. ఇటీవల సైడుకాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించారని వాటిని నిర్మించి చిరువ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనంతరం ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌గా బాలనరసయ్య, సభ్యులుగా ఎం.రమేష్, ఎన్.వెంకటేశ్వర్‌రెడ్డి, కోటేశ్వరరావు, ఎస్కే.బాజీ, ఎస్.నాగయ్య, ఎం పార్వతీలను ఎన్నుకున్నారు.

బాల్య వివాహం అడ్డగింత

పుల్లలచెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగుపల్లి గ్రామంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని సింగుపల్లిలో ఆదివారం రాత్రి బాల్య వివాహం జరుగుతుందని జిల్లా కాల్ సెంటరుకు ఫిర్యాదు అందింది. దీంతో ఐసీడీఎస్ అధికారులు హుటాహుటిన సింగుపల్లికి వెళ్లి బాల్య వివాహాన్ని అడ్డుకొని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపరువైజరు శివలక్ష్మీ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా బోల్లాపల్లి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఓ బాలికను సింగుపల్లి గ్రామంలోని తన మేనమామకు ఇచ్చి వివాహం చేసేందుకు ప్రయత్నించారని ఫిర్యాదు అందటంతో ఇరు కుటుంబాలను కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులకు నోటీసులు అందజేశారు. పోలీస్ సిబ్బంది, సార్డ్ సంస్థ ప్రతినిధులు ధర్మనాయక్, బాబు, ఐసీడీఎస్ సిబ్బంది బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు.

కష్టపడితే మంచి ఫలితాలు

ఎర్రగొండపాలెం రూరల్ నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు శాఖమూరి శ్రీనివాసరావు అన్నారు. గ్రాంథాలయ వారోత్సవాలలో బాగంగా ఆదివారం ఎర్రగొండపాలెం గ్రాంథాలయ శాఖ గ్రంథపాలకురాలు కె.రూన్సీ ఆధ్వర్యంలో కవులు, రచనలు, సందేశాల కార్యక్రమాన్ని మరియు చెస్ పోటీలను గ్రంథాలయ ఆరవణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మంచి వాఖ్యాలు వివరించారు. పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కవితల పోటీలలో కస్తూరి భా గాంధీ విద్యాలయానికి చెందిన బాల కోటేశ్వరి మొదటి విజేతగా నిలిచారు. రెండువ విజేతగా ముద్ర స్కూల్ షేక్. మెహబూబ్, మూడవ విజేతగా ఏపి గిజన గురుకుల పాఠశాలకు చెందిన డి. రంగనాయక్ నిలిచారు. చెస్ పోటీలలో గిజన గురుకుల పాఠశాలకు చెందిన యువరాజు మొదటి విజేతగా నిలిచారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం

పెద్ద దోర్నాల,నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల నేపధ్యంలో ఆదివారం కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక కవి ఈదర పెద్ద ఆంజనేయులు,ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వీ నాగమూర్తి చదివి వినిపించిన కొన్ని కవితలను విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. అనంతరం వారిని గౌరవిస్తూ గ్రంధ పాలకుడు సుబ్బారెడ్డి శాలువాలు కప్పి సన్మానించారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

గిద్దలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం యడవల్లి గ్రామంలో బెల్టుషాపు నిర్వాహకుడిని అరెస్టు చేసి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు తెలిపారు.

23 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



సరుకు స్వాధీనం చేసుకున్న అధికారులు

కొమరోలు, నవంబరు 17: కొమరోలులోని ఇస్లాంపేటలో అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 23 బస్తాల రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొమరోలు తహసీల్దార్ భాగ్యలక్ష్మి సమాచారం మేరకు గిద్దలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ స్వాతి దాడి చేసి ఈ రేషన్ బియ్యం సీజ్ చేశారు. మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొమరోలులోని ఇస్లాంపేటలో రేషన్‌బియ్యం సేకరించేందుకు ప్రస్తుతం సరుకు ఉన్న గదిని అద్దెకు తీసుకున్నాడు. ఇక్కడ రేషన్ దందా కొనసాగడంపై స్థానికులు తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆదేశాలతో వెంటనే వీఆర్వో పాండు, వీఆర్ఏ రాజేశ్వరీలు బస్తాలను స్వాధీనం చేసుకుని ఎన్‌ఫార్సుమెంట్ డీటీ స్వాతికి అప్పగించారు. పట్టుబడిన బియ్యం 11.5క్వింటాళ్లు, సుమారు రూ.42,500 విలువ ఉంటుందన్నారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని గిద్దలూరుకు తరలించారు.

రామ్మూర్తినాయుడికి నివాళి



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

పుల్లలచెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సోదరుడు రామ్మూర్తినాయుడికి పుల్లలచెరువు టీడీపీ నాయకులు నివాళ్లు అర్పించారు. ఆదివారం స్థానిక ఎన్‌టీఆర్ కూడలిలో రామ్మూర్తినాయుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, నాయకులు వేముల క్రిష్ణయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి తమ్ముడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు పార్థివ దేహానికి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నివాళ్లు అర్పించారు. రామ్మూర్తినాయుడి స్వస్థలం నారావారిపల్లి వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



మృతిచెందిన లక్ష్మయ్య(ఫైల్)

పెద్దదోర్నాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన స్థానిక గ్రీన్ ఇండియా లాడ్జిలో ఆదివారం వెలుగు చూసింది. ఈ ఘటనలో అర్ధవీడు మండలం గన్నెపల్లి గ్రామవాసి పిక్కిలి లక్ష్మయ్య(24) మృతిచెందారు. ప్రస్తుతం ఆయన దోర్నాల మండలంలోని తిమ్మాపురంలో నివాసం ఉంటున్నాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం, లక్ష్మయ్య తిమ్మాపురంలో వివాహం చేసుకుని ఐదేళ్లుగా అక్కడే నివాసముంటున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా కుటుంబ కలహాల నేపథ్యంలో దోర్నాలలోని గ్రీన్ ఇండియా లాడ్జిలో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఉన్నట్టుండి ఆదివారం ఉదయం గది నుంచి బయటకు రాలేదు. దీంతో లాడ్జీ నిర్వాహకులు గమనించి గది తలుపు తీసి చూశారు. అప్పటికే లక్ష్మయ్య మృతి చెంది ఉన్నాడు. వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలు పరిశీలించారు. అక్కడ అనుమానించే పరిస్థితులు ఏమీ లేవని, కాని చేతికి సూది వేసినట్లు గుర్తించారు. మళ్లీ వేసేందుకు నీడిల్ అలాగే ఉండడంతో అనారోగ్యంతో మృతి చెంది వుండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

విద్యార్థులకు పాటల పోటీలు



పాటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తర్లుపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 78 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా రఘునాథ్‌రెడ్డి, రామయ్య, దుండేటి గురువారెడ్డి, గాయం లక్ష్మీరెడ్డి వ్యవహరించారు. పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు వారోత్సవాల రోజున బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథపాలకులు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాలు

గిద్దలూరు : గిద్దలూరు, రాచర్ల గ్రంథాలయాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఆదివారం గిద్దలూరులో దేశభక్తి, జానపద గీతాల ఆలాపన, అలాగే కవిసమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు జి.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, గ్రంథపాల కురాలు ప్రసన్నకుమారి పాల్గొన్నారు. రాచర్ల గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, లెమన్‌స్పూన్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకులు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదినారాయణ, రవిశేఖర్‌రెడ్డి, బోయ మల్లిక్, ఏ.వీరారెడ్డి, శ్రీనివాసాచార్యులు, సుబ్బారావు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యసాయిబాబా జన్మదిన వేడుకలు

గిద్దలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రేమసుధా మందిరం ఆవరణలో సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలు ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మందిరం అధ్యక్షులు సూరె అనంతరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 18న వేదపఠనం, నామసంకీర్తన, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, 19న సామూహిక రుద్రపఠనం, వేదపఠనం, 20న గాయత్రి మంత్ర నామసంకీర్తన, 21న బాలవికాస్ బాలబాలికలతో నాటక ప్రదర్శన, 22న సత్యసాయి సామూహిక వ్రతాలు, 23న ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ నాయకులు

కొమరోలు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాతకోట బ్రహ్మనందరెడ్డి అన్నారు. స్థానిక గ్రామీణ బ్యాంకు సమీపంలో బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మనందరెడ్డి మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలో ఉందన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వారిగా పార్టీ నాయకులు చొరవ తీసుకుని పార్టీ సభ్యత్వాలను నమోదు చేయాలన్నారు. క్రియాశీలక సభ్యత్వం చేసిన వారికి పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కేతిగుంట్ల సుబ్బారాయుడు, వెంకట్రామిరెడ్డి, నాయకులు వరప్రసాద్, కృష్ణ, మురళి, వెంకటరమణ, షమీలు, బాలనారాయణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి, సంక్షేమానికి కృషి

పెద్ద దోర్నాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):పేదల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ 130 సంక్షేమ పథకాలు అమలు చేశారని ఎర్రగొండపాలెం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ ఎనుమల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోదీ రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పెట్టుబడి సాయం క్రింద ఏటా రూ.6 వేలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పురంధేశ్వరి ఆధ్వర్యంలో బీజేపీ పటిష్ఠంగా తయారైందన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని స్థానిక నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశింపీరా, అల్లూరిరెడ్డి, గాలెయ్య, లక్ష్మీరెడ్డి, దానియేలు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



విశేష అలంకరణలో అమ్మవారు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివార్లలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి వైభవంగా జాతర నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేధ్యం సమర్పించి నాగులపుట్టలో పాలుపోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మార్కండేశ్వరునికి ప్రత్యేక పూజలు





విశేష అలంకరణలో మార్కండేశ్వరుడు, జగదాంబ

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేలూరి అంజనేయశర్మ, వరుణ్‌తేజశర్మలు జగదాంబ మార్కండేశ్వర స్వాములకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కరాటే పోటీలకు తొమ్మిది మంది ఎంపిక



కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గిద్దలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాజరాజేశ్వరి బీఈడీ కళాశాల ఆవరణలో సిద్దార్థ కరాటే అకాడమి ఆధ్వర్యంలో ప్రతిభ ఉన్న కరాటే విద్యార్థులను ఎంపిక చేశారు. కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కప్‌కు గిద్దలూరుకు చెందిన ప్రదూనియా, మోహనప్రియ, సాయిమనోజ్ఞ, దర్శిని, నారాయణ, నిహాల్‌రెడ్డి, మనోజ్, మనోహర్, అర్నాబ్‌లను ఎంపిక చేసినట్లు సిద్దార్థ అకాడమి టెక్నికల్ డైరెక్టర్ ఎస్.మోహన్‌రావు, కరాటే మాస్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.


పరుగుపందెంలో సాధించిన పథకాలతో రంగఝాన్సీ చౌదరి

"ఒలింపిక్స్ రెజ్లింగ్ విభాగంలో బంగారు పతకం తేవాలని అతని కల. తను సాధించలేకపోయిన పతకాన్ని తన బిడ్డలైనా దక్కించుకోవాలని తపన పడతాడు. అయితే తనకు వరుసగా ముగ్గురు కుమార్తెలు పుట్టడంతో తొలుత నిరాశ చెంది తరువాత వారిపైనే ఆశలు పెట్టుకుంటాడు. తొలి ఇద్దరు ఆడపిల్లలకు రెజ్లింగ్‌లో శిక్షణ ఇస్తాడు. తండ్రి కలను నెరవేర్చేందుకు వారు కూడా అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటారు. ఒకరు బంగారు పతకం సాధించి తండ్రి కలను నెరవేరుస్తారు"- ఇది ప్రముఖ ఇండియన్ రెజ్లర్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత మహావీర్‌సింగ్ ఫొగాట్ జీవిత చరిత్ర. దంగల్ సినిమాలో ఆ రెజ్లర్ల పోరాట పటిమ ఎంతో స్ఫూర్తివంతంగా మన కళ్లకు కడుతుంది. అచ్చం అలాంటి దంగల్ కుటుంబం మన జిల్లాలోనూ ఉంది. ఆట వేరైనా తీరు ఒకటే. తను సాధించలేకపోయిన విజయాలను తన బిడ్డలు దక్కించుకుని తీరాలని తండ్రి తలచాడు. వారికి తనే గురువు అయ్యాడు. కఠోర సాధన చేయించాడు. తండ్రి కలనే తమ కలగా భావించారు ఆ ఇద్దరు కుమార్తెలు. పేదరికాన్ని లెక్కచేయకుండా పట్టుదలతో కృషి చేశారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక పతకాలు సాధించి నాన్న కలను నెరవేర్చిన విజేతలుగా నిలిచారు. ఎంతో స్ఫూర్తిదాయకమైన ఆ ఇద్దరు అక్కా చెల్లెళ్ల జర్నీపై ప్రత్యేక కథనం...


జిమ్నాస్టిక్స్‌లో సాధించిన పథకంతో రంగజయ చౌదరి

నయా దంగల్

- చిన్నతనం నుంచి క్రీడలపై మక్కువ పెంచుకున్న తండ్రి
- బిడ్డల ద్వారా కలలను నెరవేర్చుకునేందుకు తపన
- కుమార్తెల ఖర్చుల కోసం తల్లిదండ్రుల పస్తులు
- ఆసాంతం నాన్న శిక్షణలోనే ఇద్దరూ కఠోర శ్రమ

రాష్ట్ర, జాతీయ స్థాయిలో వందకుపైగా పతకాలు సొంతం

తండ్రి కల నెరవేర్చేందుకు ఇద్దరు అక్కా చెల్లెళ్ల క్రీడా సవారీ

పరుగు పందెంలో అక్క.. జిమ్నాస్టిక్స్‌లో చెల్లెలు పతకాల పంట

కంభం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం పెద్దనల్లకాల్వ గ్రామానికి చెందిన బొట్టా రంగనాయకులు చౌదరి నిరుపేద. ఎటువంటి ఆస్తిపాస్తులూ లేవు. ఆయన భార్య గాలెమ్మ గతంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసేది. రంగనాయకులకు క్రీడలంటే అమితమైన ఆసక్తి. చదువుకుంటూనే స్కూలు, కాలేజీ రోజుల్లో పలు పోటీల్లో పతకాలు సాధించాడు. కానీ పేదరికం వల్ల శరీర సౌష్టవానికి అవసరమైన ఆహారం, క్రీడా పరికరాలు తదితర ఖర్చులు భరించే శక్తిలేక ముందుకెళ్లలేకపోయారు. తన బిడ్డలనైనా క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆయన సంకల్పించారు. ముగ్గురు కుమార్తెలు జన్మించారు. తొలుత సంశయించినా తరువాత తన కుమార్తెలను క్రీడల్లో మెరికల్లా తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. ఆర్థిక స్థితి బాగాలేకున్నా, ఎవరి సహకారమూ అందకున్నా వెనుకడుగు వేయలేదు. రెండో కుమార్తె రంగఝాన్సీ చౌదరి, మూడో కుమార్తె రంగజయ చౌదరిలకు చిన్నతనం నుంచే ఆటల్లో శిక్షణ ఇచ్చారు.


గోల్డ్‌మెడల్ సాధించిన రంగజయ చౌదరి

పస్తులుండి కుమార్తెలకు ఖర్చు పెట్టి..

రంగనాయకులు తొలుత ఐసీఐసీఐ ఇన్సూరెన్స్ కంపెనీలో, రిలయన్స్ ఇన్సూరెన్స్‌లో సేల్స్ మేనేజర్ పనిచేశారు. అప్పట్లో నెలకు రూ.15వేలు మాత్రమే వచ్చేవి. ఉద్యోగం వల్ల కుమార్తెలకు శిక్షణ ఇచ్చేందుకు సమయం సరిపోయేది కాదు. దీంతో ఉద్యోగం మానేసి పూర్తి సమయం వారికే కేటాయించారు. తన భార్య జీతంతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తూ ఉండేవారు. దంపతులు పస్తులుండి ఖర్చు తగ్గించుకుని కుమార్తెలకు ఆహారం, శిక్షణపైనే ఖర్చు పెట్టేవారు. తండ్రే గురువుగా శిక్షణ ఇచ్చేవారు. పెద్ద కుమార్తె రంగఝాన్సీ చౌదరికి అథ్లెటిక్స్ (400 మీటర్ల పరుగు)లో, రెండో కుమార్తె రంగజయ చౌదరికి జిమ్నాస్టిక్స్‌లో చిన్నప్పటి నుంచి తర్ఫీదు ఇవ్వడంతో ఇద్దరూ ఆయా పోటీల్లో రాణించారు. ఒకరు కడప, మరొకరు సికింద్రబాద్ స్పోర్ట్స్ స్కూలులో విద్యాభ్యాసం చేస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఇప్పటివరకు 100కుపైగా పతకాలు సాధించారు. 2036లో మన దేశంలో ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం సహకరిస్తే ఒలింపిక్స్‌లో నా కుమార్తెలు పతకాలు సాధిస్తారని కోచ్, తండ్రి బొట్టా రంగనాయకులు చెప్పారు.

పతకాల పరుగులో రంగఝాన్సీ



రంగఝాన్సీ చౌదరి తొలుత వంద మీటర్ల రన్నింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. అథ్లెటిక్స్‌లో మొత్తం 65 పతకాలు సాధిస్తే అందులో 4 జాతీయ పతకాలున్నాయి. చంద్రబాబునాయుడు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన గాండీవ ప్రాజెక్టుకు కూడా ఆమె ఎంపికైంది. పరుగుల రాణి పీటీ ఉషా నుంచి ప్రశంశలు అందుకోవడమేకాక జిల్లాలో ఉగాది పురస్కారం సందర్భంగా అవార్డు అందుకుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరులో ఐసీఐసీఐ బ్యాంక్‌లో పని చేస్తోంది.

జిమ్నాస్టిక్స్‌లో రంగజయ అదుర్స్



చెల్లెలు రంగజయచౌదరి జిమ్నాస్టిక్స్‌లో 35 రాష్ట్రస్థాయి పతకాలు సాధించింది. 4 పర్యాయాలు ఏపీ ఆల్‌రౌండ్ చాంపియన్ షిప్‌గా నిలిచింది. సౌత్‌జోన్ జాతీయస్థాయిలో 3 పతకాలు సాధించి ఆల్ రౌండర్ చాంపియన్‌గా నిలిచింది.

అక్క స్ఫూర్తితో పతకాలు సాధించా..



నా చిన్నప్పటి నుంచి అక్క రంగఝాన్సీ చౌదరి స్పోర్ట్స్ స్కూల్‌కు వెళుతుండేది. ఆమెను చూసి నాకు కూడా ఆటలపై ఇష్టం పెరిగింది. స్పోర్ట్స్ స్కూలులో చేరి నేను కూడా మెడల్స్ సాధిస్తానని చెప్పగానే మా నాన్న నా ఇష్టాన్ని గుర్తించి శిక్షణ ఇచ్చి స్పోర్ట్స్ స్కూల్‌లో చేర్చారు. అందులో జిమ్నాస్టిక్స్‌పై ఆసక్తితో 35కు పైగా మెడల్స్ దక్కించుకున్నాను. రాష్ట్రంలో ఆల్ రౌండర్ చాంపియన్‌షిప్ సాధించాను.

\- రంగజయ చౌదరి

అమ్మ, నాన్నల కష్టం చూసి పట్టుదల పెరిగింది



నాకు అథ్లెటిక్స్ పరుగు పందెంలో చిన్నప్పటి నుంచి శిక్షణ ఇచ్చింది మా నాన్నే. నన్ను క్రీడల్లో ప్రోత్సహించేందుకు స్పాన్సర్లు ఎవరూ ముందుకు రాలేదు. అయినా నిరుత్సాహ పడకుండా మా అమ్మ, నాన్న ఎంతో కష్టపడ్డారు. వారి కష్టం చూసి నాలో పట్టుదల పెరిగింది. కఠోర శ్రమ చేశా. 65కు పైగా పతకాలు సాధించా. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని నాన్న కలను నెరవేర్చా. అవకాశం వస్తే దేశం తరుపున పోరాడతా.

\- రంగఝాన్సీ చౌదరి


కబడ్డీ జట్టుకు ఎంపికైన మహిళా క్రీడాకారులు

జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

ఒంగోలు విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూపు కళాశాలలో జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సెంట్రల్ జోన్ మహిళా కబడ్డీ ఇంటర్ కాలిజాట్, సెలక్షన్ ఎంపిక ఆదివారంతో ముగిసింది. ఫైనల్స్‌లో యూనివర్శిటీ తరుపున ఆడేందుకు 12 మంది క్రీడాకారులను క్రీడల కార్యదర్శి జి.శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఫైనల్ రౌండ్‌లో గెలుపొంది యూనివర్శిటీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను రైజ్ కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు, ఫిజికల్ డైరెక్టర్ హిమచంద్రబాబు, గౌరవ ఛైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, ట్రెజర్ శిద్దా భరత్, రాగ చీఫ్ కో ఆర్డినేటర్ శిద్దా ప్రవల్లిక ప్రత్యేకంగా అభినందించారు.

వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

ఒంగోలు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాపట్ల బ్రహ్మయ్యపై సస్పెన్షన్ వేటుపడింది. వివరాల్లోకి వెళ్తే.. పాతసింగరాయకొండకు చెందిన బ్రహ్మయ్య బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఈ ఏడాది జూలైలో వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి బదిలీపై వచ్చారు. మండలంలోని కనుమళ్ల గ్రామానికి చెందిన కాట్రగడ్డ అనిల్‌కుమార్ సింగరకొండ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.8 లక్షల నగదును బ్రహ్మయ్యకు అందజేశారు. ఆ నగదును ఆలయంలో జమచేయకుండా బ్రహ్మయ్య స్వాహా చేశాడు. విషయం తెలుసుకున్న అనిల్ పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఈవో కృష్ణవేణికి ఫిర్యాదు చేశారు. దీనిపై బ్రహ్మయ్య నుంచి ఈవో వివరణ తీసుకున్నారు. తదుపరి నివేదికను జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్‌కు నివేదికను పంపారు. వారి ఆదేశాల ప్రకారం నగదును సింగరకొండ ఆలయంలో జమచేయనందుకు, పాతసింగరాయకొండ ఆలయంలో ముందస్తు అనుమతి లేకుండా నిర్లక్ష్యంతో విధులకు హాజరుకానందున బ్రహ్మయ్యను సస్పెన్షన్ చేస్తూ ఈవో కృష్ణవేణి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

28న మార్కాపురంలో మెగా జాబ్ మేళా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ యువనేత, పారిశ్రామికవేత్త మాగుంట రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన నిరుద్యోగ యువత కోసం మార్కాపురంలోని సౌజన్య కన్వెన్షన్ హాలులో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. సుమారు ఐదువేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీతోపాటు బీటెక్, బీఈ, ఎంబీఏ, ఎంసీఏ, బి.ఫార్మసీ 2020-24 బ్యాచ్ విద్యార్థులకు ఈ జాబ్‌మేళాలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. వివరాలకు 97037 68078, 88865 03632 సెల్ నెంబర్లలో సంప్రదించాలని రాఘవరెడ్డి కోరారు.

నేడు, రేపు ఉపాధ్యాయులకు శిక్షణ

ఒంగోలు విద్య, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎంపిక చేసిన 22 పాఠశాలల్లో 8, 9, 11 తరగతులకు కెరీర్ ఎడ్యుకేషన్ బోధించే ఉపాధ్యాయులకు సోమ, మంగళవారాల్లో ఒంగోలులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో రిఫ్రెషర్ శిక్షణను ఇస్తున్నట్లు డీఈవో కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు 8వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు, మంగళవారం 9,11 తరగతుల ఉపాధ్యాయులకు ఉదయం 9 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.



విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుల్లాయిస్వామి డిమాండ్
- రేపు పొదిలిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుల్లాయిస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 19వ తేదీన పొదిలిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా 20వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27 నుంచి నాలుగు రోజుల పాటు విజయనగరంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభల్లో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు ఆంజనేయులు, పవన్‌కుమార్, కార్తీక్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

- రూ.62,790 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం

మార్కాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అలుగు వీధిలోని ఓ గృహంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.62,790 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు స్థానిక 8వ వార్డు పరిధిలోని అలుగువీధిలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సిబ్బందితో కలిసి ఆ గృహంపై దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

ఏలూరులో 10 బైకులు సీజ్

పొదిలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పొదిలి పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా 10 మోటార్ బైకులను సీజ్ చేశారు. పదిమంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వేమన తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


పరుగు పందెంలో పాల్గొన్న పోలీసులు


వాలీబాల్ ఆడుతూ ఎస్పీ


మెడల్, ప్రశంసాపత్రాలతో విజేతలు, పక్కన ఎస్పీ, ఇతర పోలీసులు

ఉత్సాహంగా సాగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్

విజేతలకు బహుమతులను అందజేసిన ఎస్పీ

ఒంగోలు(క్రైం), నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పోలీస్ పరేడ్ మైదానంలో జరుగుతున్న జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ ఆదివారం రాత్రితో ముగిసింది. రెండు రోజులు జరిగిన పోటీల్లో నాలుగు సబ్‌డివిజన్ల జట్లతో పాటు ఏఆర్ జట్టు పాల్గొంది. ఉల్లాసకరమైన వాతావరణంలో పోలీసుల ఆటల పోటీలు జరిగాయి. రాత్రి పొద్దుపోయే వరకు ఈ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి పతకాలు, ట్రోఫీలు, సర్టిఫికెట్లను ఎస్పీ దామోదర్ అందజేశారు. వాలీబాల్ ఫైనల్ ఎంతో ఆసక్తిగా జరిగింది. క్రీడాకారులు క్లోసింగ్ మార్చ్ చేసి ఎస్పీకి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఎస్బీ డీఎస్పీ సురేష్‌బాబు, డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, నాగరాజు, లక్ష్మీనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన మైన్స్ భద్రతా వారోత్సవాలు


వారోత్సవాల ముగింపులో పాల్గొన్న గ్రానైట్‌క్వారీ యజమానులు

ఒంగోలు(క్రైం), నవంబరు17 (ఆంధ్రజ్యోతి): గ్రానైట్, మైన్స్ భద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి ఒంగోలులోని ఏ1 ఫంక్షన్ హాలులో ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ జోనల్ ఛైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్ హాజరయ్యారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన గ్రానైట్ క్వారీల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైన్స్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్ ఉజ్వల్‌థా మాట్లాడుతూ క్వారీలు, మైన్స్ తవ్వకాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ జోన్ మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ భూషణ్‌ప్రసాద్‌సింగ్, రీజియన్ డైరెక్టర్ సుప్రియాచక్రవర్తి, జిల్లా మైనింగ్ అధికారి టి.రాజశేఖర్, సేఫ్టీ వీక్ కన్వీనర్ కె.జ్ఞానేశ్వర్, జీవీటీసీ ఛైర్మన్ ఆర్.లక్ష్మీనారయణ, చలువాది బదరీనారయణ తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండకు అనుసంధానం చేయండి

- రోడ్లకు, డయాలసిస్ యూనిట్‌కు నిధులివ్వండి
- నిర్మాణాల్లో డొల్లతనాన్ని నివారించాలి
- అసెంబ్లీలో కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర విజ్ఞప్తి

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

కరువు, వలసల నివారణ చర్యల్లో భాగంగా కనిగిరి నియోజకవర్గంలో తాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు, పరిశ్రమల ఏర్పాటుకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. బయోఇంధన ప్రాజెక్టు కేటాయించినందుకు ధన్యవాదాలు చెబుతూ మరిన్ని అవసరాలను అసెంబ్లీ ద్వారా ఆయా శాఖల మంత్రులు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం ఆయనకు అసెంబ్లీలో మాటాడే అవకాశం లభించింది.

తొలుత తాగు, సాగునీటి సమస్యను తద్వారా నియోజకవర్గ ప్రజల వలసల బాటను, కిడ్నీ వ్యాధికి గురవుతున్న ప్రజలు బాధలను అసెంబ్లీలో విపులీకరించారు. పాలేటిపల్లి, మోపాడు రిజర్వాయర్లు వెలిగొండ ప్రాజెక్టుకు అనుసంధానంచేసి సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి తోడ్పడాలని కోరారు. కనిగిరిలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణంతోపాటు ఇంటింటికి కొళాయి ద్వారా తాగునీరు అందించే పథకాలను చేపట్టాలని కోరారు. ప్రధానంగా రోడ్ల సమస్యలను ప్రస్తావిస్తూ గత ఐదేళ్ళ వైసీపీ పాలన ఫలితంగా నియోజకవర్గంలోని లింకురోడ్లు, ప్రధాన గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా మారాయని వివరించారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఓవీ రోడ్డు నిర్మాణం గత ప్రభుత్వంలో గాలికి వదిలేశారని చెప్పారు.

నియోజకవర్గ పరిధిలో 35.4 కిలోమీటర్లు పొడవునా రోడ్లు నిర్మాణం జరగాల్సి ఉండగా, ఐదేళ్లల్లో కేవలం ఏడు కిలోమీటర్లు పొడవున నిర్మాణం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే జేఎంజే సంస్థ కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్స్ ఇప్పించినా పనులు ప్రారంభించ లేదని చెప్పారు. పైగా నిర్మించిన ఏడు కిలోమీటర్ల రోడ్డులో నాణ్యతా లోపం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే సంబంధిత శాఖ మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లానని, వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని మిగిలిన రోడ్డు నిర్మాణం చేపట్టాలని సూచించారు. కనిగిరి, పామూరు, సీఎస్‌పురంలో జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. సదరు అధికారులతో మాట్లాడినా స్పందన లేదన్నారు. మూడు జాతీయ, రాష్ట్ర రహదారులు నియోజకవర్గంలో విస్తరించినా స్థానిక రహదారుల అభివృద్ధి జరగక ఇబ్బందిగా ఉందని తగినంత నిధులు కేటాయించాలని కోరారు.

బయోఇంధన ప్రాజెక్టు ఒక వరం

రిలయన్స్ సంస్థ చేపట్టే బయోఇంధన ప్రాజెక్టు తొలి యూనిట్ కనిగిరికి కేటాయించటం నియోజకవర్గానికి ఒక వరమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ప్రజల తరుపున ధన్యవాదాలు చెప్పారు. ఒప్పందం జరిగిన రెండవరోజే రిలయన్స్ ప్రతినిధులు నియోజకవర్గంలో పర్యటించి అవసరమైన స్థలాన్ని గుర్తించటం ప్రజల్లో నమ్మకం పెంచిందన్నారు. లక్షల ఎకరాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తుల భూమి సాగుకు అనుకూలంగా ఉన్నందున మరిన్ని పరిశ్రమలను కనిగిరికి కేటాయించి ఆదుకోవాలని సూచించారు.


డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

యువగళం పాదయాత్రలో భాగంగా కనిగిరి వచ్చిన నారా లోకేష్ ఫార్మా హబ్‌గా కనిగిరిని అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీని డాక్టర్ ఉగ్ర గుర్తుచేశారు. నియోజకవర్గంలో అధికంగా ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం గత టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం నిర్వాహణ వైసీపీ ప్రభుత్వంలో కుంటు పడిందన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు దాతల సహకారంతో సుమారు రూ.50 లక్షలతో అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. డయాలసిస్ యూనిట్‌ను ప్రభుత్వమే అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కోరారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో రాణించాలి

కనిగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో రాణించాలని ఎంఎస్ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు పేర్కొన్నారు. ఈనెల 25 నుంచి 29 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అలీఘడ్‌లో జరిగే 43వ జతీయస్థాయి ఖోఖో పోటీల్లో ఎంఎస్ఎం కళాశాల విద్యార్థిని టి.సుస్మిత ఎమ్మెస్సార్ విద్యార్థిని ఆర్.యశోద పాల్గొంటున్నారు. ఆదివారం స్థానిక ఎంఎస్ఎం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు ఎమ్మెస్సార్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి విద్యార్థినులను అభినందించారు.

ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గతనెల 25 నుంచి 27 వరకు చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగిన 43వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో ప్రకాశం జిల్లా తరుపున పాల్గొన్నారు. ప్రకాశం జట్టు తృతీయ స్థానంలో సాధించటంలో కృషి చేసిన వీరిని జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికచేయటం గొప్ప విషయమన్నారు. ఈనెల 18 నుంచి 22 వరకు కాకినాడ జేఎన్‌టీయూలో జరిగే శిక్షణ శిబిరంలో మంచి తర్ఫీదు పొంది కనిగిరి ప్రాంతానికి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. వీరిరువురిని రాష్ట్ర ఖోఖో సంఘం చీఫ్ పాట్రన్, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ఖోఖోసంఘం నాయకులు అభినందించినట్లు జిల్లా ఖోఖో సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బి.కాశీ విశ్వనాధరెడ్డి తెలిపారు.


విద్యార్థినులను అభినందించిన ఎంఎస్ఎం కరస్పాండెంట్ సుబ్బారావు తదితరులు

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

దొనకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక అడ్డరోడ్డులోని విజయాంజనేయస్వామి దేవాలయంలో ధర్మకర్త సిరిగిరెడ్డి బాలిరెడ్డి నేతృత్వంలో శనివారం రాత్రి పడిపూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్పస్వామి నామస్మరణతో ఆప్రాంతం మారుమోగింది. గురుస్వాములు డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, బాలరంగయ్య, విజయాంజనేయస్వామి అయ్యప్ప భక్త బృందం ప్రత్యేక పూజలు, భజనలు, ఆరాధనలు నిర్వహించారు. రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస రెడ్డి వేడుకలకు విచ్చేసిన భక్తులకు బిక్ష ఏర్పాటుచేశారు.


పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

జ్ఞాన ప్రసూనాంబకు ప్రత్యేక పూజలు



కురిచేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామి వారికి 30వ వార్షిక లక్ష బిల్వార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. శివునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వ హించారు. జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి మహిళా భక్తులు కుంకుమ పూజచేశారు. కార్యక్రమంలో కురిచేడు బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య కలశ పునఃప్రతిష్ఠ

ముండ్లమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఆలయంలో కలశ పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అనంతరం దేవతా మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు.

నిషేధిత జాబితా నుంచి భూమి తొలగింపు


ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు ఎన్‌వోసీ కాపీని చూపుతున్న పామూరు టీడీపీ శ్రేణులు

పామూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని సర్వే నెంబర్ 200/2లో గల భూమిని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చొరవతో నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ దేవదాయ, రెవెన్యూ శాఖలు ఎన్‌వోసీ కాపీ జారీ చేశాయి. ఈక్రమంలో పామూరు టీడీపీ శ్రేణులు ఆదివారం ఉగ్రను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దేవదాయ అధికారులు తమ భూమిగా రికార్డుల్లో చూపించడంతో రెవెన్యూ అధికారులు ఆ సర్వే నెంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్పించారు. దాంతో గత ఐదు సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. దాంతో కొనుగోలు, అమ్మకాలు జరగక, బ్యాంకు రుణాలు మంజూరుకాక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈజాబితా నుంచి తొలగించడంతో వీరి సమస్య తీరింది. ఉగ్రను కలిసినవారిలో రాచూరి మన్నధ, అల్లు వెంకటేశ్వర్లు, పండిటి హరీష్, పెసల నరసింహారావు, సోమిశెట్టి లక్ష్మణ్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

తాళ్లూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 43 సంవత్సరాల తర్వాత ఆదివారం వీకే ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. చిన్నతనంలో వారి స్నేహం, బంధాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం వారి కుటుంబం, స్థితిగతుల గురించి చర్చించుకున్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉంటూ తమ తోటి స్నేహితులకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. తమకు చదువు చెప్పిన నాటి గురువులు వారి సేవలను గుర్తు చేసుకున్నారు. విద్యుత్ డీఈ మస్తాన్‌రావు, పారిశ్రామిక వేత్తలు ఎడమకంటి లక్ష్మీరెడ్డి, పవన్‌కుమార్, ఉపాధ్యాయుడు భూమా శ్రీనివాసరావు, రాజకీయ నాయకుడు ఇడమకంటి గురువారెడ్డి, ఫొటోగ్రాఫర్ సుబ్బయ్య, సెరీకల్చర్ ఉద్యోగి ఇడమకంటి అంజిరెడ్డి, నాగేశ్వరరావు, సుబ్రమణ్యంరెడ్డి, పాస్టర్ అబ్రహంలింకన్ మరో 20 మంది పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు. ఆటపాటలతో సందడిగా గడిపారు.

గేదెల కొమ్ములకు రేడియం పెయింట్

పామూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై గేదెలు సంచరిస్తుండటంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటివల్ల జరిగే ప్రమాదాల నివారణకు డిహెచ్ఆర్ ట్రస్ట్ తరుపున సభ్యులు సొంత నిధులు వెచ్చించి గేదెల కొమ్ములకు రేడియం పేయింట్ వేయించడం అభినందనీయమని ఎంపీటీసీ బొల్లా నరసింహారావు అన్నారు.

మండలంలోని నుచ్చుపొద గ్రామంలో దేవరపు హనుమంతరావు (డీహెచ్ఆర్) ట్రస్ట్ తరుపున రేడియం పెయింట్ వేయించే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు దేవరపు రవిబాబు, డాక్టర్ చంద్రబాబు, కేశవ మాట్లాడుతూ తన తండ్రి హనుమంతరావు ద్విచక్ర వాహనంపై వస్తూ గతనెల 29న గేదె తగిలి మృతి చెందారని తెలిపారు. ఇలాంటి ఘటనలతో మరో కుటుంబానికి నష్టం జరగకూడదని తమ వంతుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ ఇమని శ్రీసాయి, తిరివీధి జనార్ధనరావు, వీఆర్వో దుద్దుకూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని బైకిస్టు మృతి

కనిగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ సమీపంలోని చాకిరాల వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ టి.శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామానికి చెందిన నాగిరెడ్డి (58) కనిగిరి నుంచి మొగళ్ళూరు వెళ్తున్నాడు. ఈక్రమంలో సీఎస్‌పురం నుంచి కనిగిరి వస్తున్న కారు చాకిరాల వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న నాగిరెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యం అందిస్తుండగా నాగిరెడ్డి మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి నిధులతో మురుగు కాల్వల నిర్మాణం

ముండ్లమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లులోని బస్టాండ్ సెంటర్ నుంచి చింతలపూడి వెళ్ళే ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30 లక్షల నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఎక్స్‌కవేటర్‌తో పనులు ప్రారంభించారు. అలాగే, మండలంలోని పలుగ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. పోలవరం పంచాయతీ అవిశనవారిపాలెంకు రూ.30 లక్షలు, పులిపాడుకు రూ.30 లక్షలు, వేములకు రూ.30 లక్షల నిధులు విడుదలైనట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల హక్కులను కాపాడాలి

తాళ్లూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కులను కాపాడటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని వీకే ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కొండపల్లి ఆంజనేయులు అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల హక్కులను, బాధ్యతలను తెలిపి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు.

ఆర్టీసీ బస్సులు లేక ఆటోల్లో ప్రయాణం

ముండ్లమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాలకు ఆర్టీసీ బస్సులు నిలిపివేశారు. దీంతో ప్రైవేట్ వాహనాలు ఆటోలు, జీపులను ఆశ్రయిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా అద్దంకి, పొదిలి, వినుకొండ డిపోల నుంచి మండలంలోని పలు గ్రామాలకు బస్సులను నడిపేవారు. అకారణంగా రద్దుచేయటంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పోలవరం, తూర్పుకంభంపాడు, వేములబండ గ్రామాలకు అద్దంకి ఆర్టీసీ డిపో నుంచి బస్సులు నడిపారు. సింగనపాలెంకు పొదిలి, ఈదర, వయా రమణారెడ్డి పాలెం, వేముల మీదుగా బస్సు సౌకర్యం ఉండేది. అద్దంకి నుంచి వయా తమ్మలూరు, పూరిమెట్ల ఈదర మీదుగా మూడు ఆర్టీసీ బస్సులు వినుకొండకు నడిపారు. ప్రస్తుతం ఒక్క బస్సును మాత్రమే అద్దంకి, వినుకొండకు తిప్పుతున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు చేసేదేమి లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

తూర్పుకంభంపాడుకు రెండు దశాబ్దాలకు పైగా అద్దంకి డిపో బస్సు ప్రతిరోజు ఉదయం, సాయంత్ర తిరుగుతుండేది. గత నాలుగు సంవత్సరాలుగా బస్సులు రద్దు కావటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సింగనపాలెంకు పొదిలి డిపో బస్సు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నడిచేది. అదికూడా రద్దు చేశారు. అద్దంకి డిపో నుంచి వేములబండతో పాటు వేముల వయా అయోధ్య నగర్‌కు బస్సులు తిరిగేవి. మారెళ్ళ నుంచి మక్కెనవారిపాలెంకు బస్సులు నడిపేవారు. నేడు ఈ సౌకర్యం లేదు.

మండలంలో దాదాపు 15 గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిచేవి. ప్రస్తుతం ఆయా గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులు రద్దయ్యాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి రావటంతో ప్రమాదాలు జరిగి మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా గ్రామాలకు బస్సులను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

రామ్మూర్తినాయుడు మృతి తీరనిలోటు

కనిగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు రామ్మూర్తినాయుడు మృతి తీరనిలోటని టీడీపీ నేతలు పేర్కొన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామ్మూర్తినాయుడు మృతి వారి కుటుంబానికే కాకుండా టీడీపీ కుటుంబసభ్యులకు తీరనిలోటన్నారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నాయకులు రోషన్‌సంధాని, శ్రీనివాసులరెడ్డి, జంషీర్, తిరుపాలు, తమ్మినేని వెంకటరెడ్డి, ఏనుగు శ్రీను తదితరులు ఉన్నారు.

దొనకొండ: మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటని ఆపార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో మోడి వెంకటేశ్వర్లు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, మన్నెం గాలెయ్య, కొమ్మతోటి సుబ్బారావు, బండ్ల వెంకటనారాయణ, నిమ్మకాయల సుబ్బారెడ్డి, పెమ్మసాని లక్ష్మీనారాయణ, విప్పర్ల లక్ష్మీరావు, పోతిపోగు చెన్నయ్య, సురేష్ ఉన్నారు.


కనిగిరి: కొవ్వొత్తులు వెలిగించి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

తాళ్లూరు: స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో టీడీపీ నాయకులు జి.వేణుబాబు, పాలం అంజిరెడ్డి, కొర్లపాటి రామయ్య, జి.లక్ష్మీనారాయణ, శివనాగిరెడ్డి, సోము శ్రీను, నాదెండ్ల శ్రీను తదితరులు ఉన్నారు.

జీవో నెం.117ను రద్దుచేయాలి

పామూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జీవో నెంబర్ 117ను తీసుకొచ్చి ఉపాధ్యాయులను ఇబ్బందులు పెట్టిందని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ హై, జిల్లా కార్యదర్శి అరియారం సురేష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి, యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. అనంతరం యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా ముప్పాళ్ల సురేష్, జీలా ఉదయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సమావేశంలో నాయకులు పోతులూరయ్య, గళ్ల చెన్నయ్య, ఎం.శ్రీనివాసరాజు, ఎస్.వీరబ్రహ్మం, పి.తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా, యూటీఎఫ్ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధనరావు, యారవ శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

కురిచేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నెం శ్రీనివాస రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మైలవరపు శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.పూర్ణ చంద్రరావు, మహిళా సహఅధ్యక్షురాలిగా హిల్లా నైటింగేల్, అసోసియేట్ అధ్యక్షుడిగా జాన్ బాబును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మిగడ వెంకటేశ్వర రెడ్డి, టి.రాజశేఖర్, వెంకటరెడ్డి, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఖాసింకు నివాళి

దొనకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో షేక్ మహమ్మద్ ఖాసిం అంకితభావంతో పనిచేశారని పలువురు నివాళులర్పించారు. కురిచేడు తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఆయన శనివారం విధులు ముగించుకొని దొనకొండకు వస్తూ జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. రెండు నెలల క్రితం దొనకొండ నుంచి కురిచేడుకు బదిలీపై వెళ్లాడు. స్థానిక బ్రహ్మారావు పేటలో ఆయన మృతదేహానికి ఆదివారం దొనకొండ డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, రెవెన్యూ సిబ్బంది నివాళులర్పించారు. కురిచేడు తహసీల్దార్ రజనీకుమారి, సిబ్బంది ఖాసిం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బాలల హక్కులకు భంగం కలిగించొద్దు!

పామూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులకు భంగం కలిగించొద్దని స్వయం కృషిసేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ అన్నారు. మండలంలోని డీపీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బాలలదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మా పిల్లలు మా బాధ్యత కార్యక్రమంపై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ రత్తమ్మ, సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు

పామూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో ఆదివారం పామూరులోని మల్లికార్జునరెడ్డి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి 5వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 400 మంది వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

చెత్తసంపద కేంద్రం రేకుల అపహరణ

పీసీపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): చెత్తసంపద కేంద్రం పైకప్పు రేకులు చోరీకి గురయ్యాయని మురుగుమ్మికి చెందిన క్రిష్టారెడ్డి గ్రామస్థులతో కలిసి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 2018లో గ్రామంలో ఉపాధిహామీ నిధులతో చెత్తసంపద కేంద్రాన్ని నిర్మించారు. అదే గ్రామానికి చెందిన శ్రీను, వెంకట్రావు, అంజయ్య అనే ముగ్గురు వ్యక్తులు ఆ రేకులను అపహరించి సొంత అవసరాలకు వాడుకుంటున్నారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బెల్టుషాపుల నిర్వాహకులపై బైండోవర్ కేసులు

ముండ్లమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వైనాగరాజు తెలిపారు. పసుపుగల్లులో ముగ్గురు, ఉమామహేశ్వర అగ్రహారంలో ముగ్గురు, నూజెండ్లపల్లిలో ఒకరిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఏ గ్రామంలోనైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు సుబ్రహ్మణ్య షష్టి

కురిచేడు నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కురిచేడులో వేంచేసి ఉన్న యోగయ్య స్వామి మఠంలో సోమవారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. యోగయ్య స్వామి మఠాన్ని ఆలయ కమిటీ పునర్నిర్మిస్తున్నది. ఆలయం నిర్మాణం పూర్తికావస్తున్నది. త్వరలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా ఆలయంలో యోగయ్య స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 18 నవంబరు 2024





వరద నిధులు.. కృష్ణార్పణం

- నదిలో నీరు తగ్గిన నెలల తర్వాత పనులు
- అవసరమైనవి వదిలేసి ఇష్టారీతిన పనులు
- కొరవడిన పర్యవేక్షణతో అనవసరపు పనులు
- జంగిల్ క్లియరెన్స్ పేరుతో తూతూమంత్రంగా
- కరకట్టకు ఇరువైపులా నీడనిచ్చే చెట్ల తొలగింపు


వల్లభాపురం స్లూయిజ్ దగ్గర్లో కరకట్ట రోడ్డుకు దూరంగా ఉన్న చెట్టును ఎక్సకవేటర్‌తో విరిచేసిన చిత్రం

వరద పనులు అంటే వరదకి ముందో.. వరద సమయంలో అత్యవసరంగానో చేస్తారు. కానీ నీటిపారుదల శాఖ మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా చేస్తుంది. నిధులు ఉన్నాయి.. పనులు చేస్తున్నామన్నట్లు చేస్తున్నారే కానీ అవి అవసరమా.. వాటి వల్ల ఉపయోగమా అన్న విషయాలను పట్టించుకోవడంలేదు. వరద వచ్చిపోయిన నెలల తర్వాత వరద పనుల పేరుతో తూతూమంత్రంగా చేస్తోంది. పనికి రాని కంప చెట్లను తొలగించాల్సిందిపోయి కరకట్టకు ఇరువైపులా నీడనిస్తున్న వృక్షాలను నేలకూల్చేస్తున్నారు. ఏ పని ఏ తరహాలో చెయ్యాలనే సూచనలు చేసే నాథుడేలేడు. ఆర్సీ విభాగంలో సిబ్బంది కొరత, ఉన్న సిబ్బంది, అధికారులు కొత్తగా బదిలీపై వచ్చిన వారు కావడంతో పనులపై పర్యవేక్షణ లోపించింది. ఎక్సకవేటర్ ఆపరేటర్‌కు ఏది చేస్తే అదే పనిగా గాలికొదిలేశారు.

తెనాలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి ఇటీవల రికార్డు స్థాయిలో వచ్చిన వరదతో కరకట్ట అంచులకు నీరు చేరింది.. మరికొన్నిచోట్ల పైనుంచి కూడా ప్రవహించింది. ఆ సమయంలో అత్యవసర మరమ్మతులకు ప్రభుత్వం కుడి, ఎడమ కరకట్టలకు రూ.48 లక్షలు కేటాయించింది. వరద వచ్చాక కేవలం ఇసుక మూటలు, అత్యవసరమనుకున్నచోట ఎక్సకవేటర్లతో కట్టలు సరిచేశారు. మిగిలిన నిధులతో కరకట్టకు ఇరువైపులా పెరిగిన ముళ్ల కంపను తొలగించడం, పేరుకుపోయిన మట్టి, ఇసుకను వెలుపలకు నెట్టేయడం, చెత్త కుప్పలను తొలగించడం వంటి పనులు చెయ్యాలి. కరకట్ట అంచులు ఎక్కడైనా బలహీనంగా ఉంటే వాటిని మట్టితో బలపరిచే పనులు చెయ్యాలి. అయితే వరద సమయంలో ఇసుక మూటలువేసే పనులు చేసిన అధికారులు ఆ తర్వాత మిగిలిన నిధులతో పనులు చేశామనిపించే విధంగా తూతూమంత్రంగా చేయడం విశేషం. అసలు పనికి బదులు అనవసరపు పనులు చేయడంపై విమర్శలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.


ప్రాతూరు దగ్గర వేపచెట్టును అడ్డులేకున్నా వేర్లు కదిలిపోయి బయటకువచ్చేలా నేలపైకి నెట్టేసిన చిత్రం


చిర్రావూరు దగ్గర చిన్నపాటి కంపచెట్టు కూడా తొలగించలేని విధంగా మట్టితో సహా వదిలేసి, పైపైన గీరేసి వదిలేసిన చిత్రం

ముళ్లకంప వదిలేసి..

కృష్ణానదికి కుడి కరకట్టపై వారధి నుంచి మున్నంగి వరకు 20 కి.మీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్, కరకట్ట కోత, బలహీనపడటం వంటి చోట్ల మరమ్మతులు చెయ్యాలి. దీని కోసం రూ.9 లక్షల వరకు మంజూరు చేశారు. అయితే వరద సమయంలో పెదకొండూరు-వల్లభాపురం మధ్య కొన్నిచోట్ల మాత్రమే ఇసుక మూటలు వేశారు. వరద సమయంలో కంప తొలగింపు అవకాశమేలేదు. దీంతో వరద తర్వాత ఇప్పుడు ఈ పనులు చేపట్టారు. అయితే చేస్తున్న కొద్దిపనులు కూడా సంపూర్ణంగా చేయడంలేదు. రోడ్డుపైకి అడుగు వెడల్పులో మట్టిపేరుకుపోయి దానిపై కంప మొలచినా కనీసం దానిని కూడా తొలగించడంలేదు. కరకట్టకు ఇరువైపులా ఏడేళ్ల నుంచి పెంచుతున్న చెట్లను నేలకూల్చడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాతూరు, చిర్రావూరు, గొడవర్రు, అత్తలూరివారిపాలెం, వల్లభాపురం ప్రాంతాల్లో నీడనిచ్చే చెట్లను నేలకూల్చేశారు. అడ్డొచ్చిన కొమ్మలు కాకుండా కరకట్టకు మూడు నుంచి ఐదు అడుగుల దూరంలో ఉన్న చెట్లను కూడా వేళ్లతో తొలగిస్తున్నారు. దీనిపై ఆర్సీ విభాగం జేఈ విజయరాజును ప్రశ్నిస్తే చెట్లు కొట్టేయమని చెప్పలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. వరద పనులు అప్పట్లో అత్యవసరం అనుకున్నవి చేశామని, మిగిలిన పనులను ప్రస్తుతం చేస్తున్నామని చెప్పారు.

భయం భయంగా కరకట్ట

కరకట్టకు ఇరువైపులా ఇంగ్లీష్ తుమ్మ, ఇతర ముళ్ల పొదలు దట్టంగా అల్లుకుపోయాయి. కుడి కరకట్టకు వారధి నుంచి పెనుమూడి వరకు చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. వీటి కారణంగా వరద సహాయ చర్యలకి, కరకట్ట అత్యవసర పనులకు ఇబ్బందిపడాల్సి వచ్చింది. కరకట్ట ఆధునికీకరణ జరిగిన ప్రాంతంలోనే ఇలా ఉంటే, పనులు ఆగిపోయిన ప్రాంతంలో పరిస్థితి దారుణంగా ఉంది. వారధి దగ్గర కరకట్ట ప్రారంభమైన దగ్గర కొంతమేర విస్తరణ జరగలేదు. అయినా ఇక్కడ కంప చెట్ల సమస్య రాలేదు. విస్తరణ జరిగిన చిర్రావూరు-కొల్లిపర మధ్య మరింత దారుణంగా మారింది. దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర రోడ్డు అధ్వానంగా ఉంటే, కంప పెరిగి మరింత సమస్యగా మారింది. కరకట్ట ఆధునికీకరణకు ముందే పెదకొండూరు-వల్లభాపురం మధ్య డబుల్ రోడ్డు నిర్మాణం జరిగింది. దీంతో 4 కిలోమీటర్ల రోడ్డుపై ఆధునికీకరణ సమయంలో ఒక్క పని కూడా చెయ్యలేదు. దీంతో ఈ ప్రాంతంలో రెండు వైపులా ముళ్ల కంప కమ్మేసి, రోడ్డు కుచించుకుపోయింది. కొల్లిపర-చిలుమూరు మధ్య కొన్నిచోట్ల కంప పెరిగింది. కొల్లూరు-ఈపూరు, దోనేపూడి-వెల్లటూరు మధ్య రోడ్డు పనులు జరగలేదు. దీంతో కమ్మేసిన చెట్లను కూడా తొలగించే చర్యలు చేపట్టలేదు. ఈ ప్రాంతాల్లో మనిషి అడుగు పెట్టడం కూడా గగనమే. ఇటువంటి చోట్ల ఒక్కపని కూడా చెయ్యలేదు. జంగిల్ క్లియరెన్స్ అవసరం ఉన్నచోట కాకుండా కంపచెట్లు పెద్దగా లేనిచోట పనులు చేశామనిపించుకోవడం విశేషం.

ఆర్‌జేడీ కార్యాలయం.. ప్రక్షాళన

- దీర్ఘకాలంగా తిష్ఠేసిన ఉద్యోగుల బదిలీ
- ఆఫీస్ బేరర్ సర్టిఫికెట్‌తో ఓ ఉద్యోగి పదేళ్లుగా విధులు
- అక్రమాలకు అండగా ఉన్నవారి స్థానచలనానికి కార్యాచరణ

గుంటూరు(విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాయం(ఆర్‌జేడీ)లో దీర్ఘకాలంగా తిష్ఠవేసి అక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కలిగించేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే ఏడీ స్థాయిలో ఉన్న ఉద్యోగిని కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. మరో ఇద్దరు ఉద్యోగుల్ని కూడా బదిలీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. మిగిలిన సిబ్బందిని దశలవారీగా బదిలీ చేయాలని నిర్ణయించారు. గుంటూరు డీఈవో కార్యాలయ ఆవరణలోని ఆర్‌జేడీ పరిధిలో గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాలు ఉన్నాయి. ఆయా జిల్లాల పరిధిలోని హెచ్‌ఎం స్థాయి ఉపాధ్యాయులు, ఎంఈవోల సర్వీస్ రూల్స్, ప్రైవేటు స్కూల్స్ గుర్తింపు, బీఈడీ, డీఈడీ కళాశాల నిర్వహణ, పనితీరు, తనిఖీలు, ప్రైవేటు స్కూల్స్‌లో అదనపు తరగతులకు అనుమతులు తదితర విషయాలను ఆర్‌జేడీ కార్యాలయం పర్యవేక్షిస్తోంది. ఇప్పటి దాక ఇక్కడ పనిచేసిన అధికారుల మెతక వైఖరిని అడ్డం పెట్టుకుని ఉద్యోగులు చెలరేగిపోయారన్న విమర్శలున్నాయి. అక్రమ పద్ధతుల్లో సంవత్సరాల తరబడి ఇక్కడే తిష్ఠవేసి సంపాదనలో మునిగిపోయారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవల బాధ్యతలు చేపట్టిన కార్యాలయ అధికారి ఉద్యోగులపై అక్రమాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. కొన్ని విషయాల్లో ఆయన్ని సైతం తప్పుదోవపట్టించేందుకు ఉద్యోగులు ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆయన కార్యాలయ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు సంఘాల నాయకులు చెబుతున్నారు.

- ఇక్కడ కీలకంగా పనిచేసే ఓ ఉద్యోగి ప్రకాశం జిల్లా నుంచి డిప్యూటేషన్‌పై వచ్చాడు. జిల్లాకు చెందిన ఓ సంఘం నేత నుంచి ఆఫీస్‌బేరర్ సర్టిఫికెట్ తీసుకువచ్చి దాదాపు పదేళ్ళుగా కార్యాలయంలో ఉద్యోగం వెలగబెడుతున్నాడు. వాస్తవానికి ప్రకాశం జిల్లాకు చెందిన ఈ ఉద్యోగికి గుంటూరు జిల్లాకు చెందిన ఉద్యోగ సంఘ నాయకుడు ఇచ్చే ఆఫీస్ బేరర్ సర్టిఫికెట్ ఉపయోగపడదు. అయితే అధికారుల్ని మాయచేసి ఇప్పటికీ ఇక్కడే కొనసాగుతున్నాడు. కార్యాలయంలోని సెక్షన్లలో ఎవరి ఫైల్ ఎక్కడ ఉంది.. దాని స్థితి ఏమిటి.. పరిష్కారానికి ఎంత చెల్లించాలనేది ఈ ఉద్యోగి నిర్ణయిస్తాడని సమాచారం.
- ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన మరో ఇద్దరు ఉద్యోగులు దాదాపు ఐదేళ్ల నుంచి ఇక్కడే పనిచేస్తున్నారు. కార్యాలయానికి పనుల కోసం వచ్చే వారిని విభాగాలకు తీసుకెళ్ళి బేరాలు కుదర్చడంలో వీరుదిట్ట అనే ఆరోపణలు ఉన్నాయి.
- కార్యాలయంలో సూపర్‌మెన్‌గా పేరున్న ఓ ఉద్యోగి దాదాపు ఏడేళ్ల నుంచి పనిచేస్తున్నాడు. ఈ సూపర్‌మెన్ అక్రమాలు సూపర్‌గానే ఉంటాయన్న ఆరోపణలున్నాయి. ప్రతి ఫైలుకు రేటు పెట్టి వసూలు చేస్తాడని సమాచారం. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు ఎక్కువ కాలం ఇతర జిల్లాల్లో ఇన్‌చార్జీలుగా పనిచేశారు. దీంతో ఈ సూపర్‌మెన్ ఫైల్స్‌ను ఏకంగా అధికారి పనిచేసే వద్దకే తీసుకెళ్లి పరిష్కరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- డీఈడీ కళాశాల గుర్తింపు, రెన్యువల్‌లో హైదరాబాద్‌లో జరిగిన అక్రమ వసూళ్ల విషయంలో గుంటూరు ఆర్‌జేడీ కార్యాయలంలో పనిచేసిన ఓ అధికారి కీలకంగా ఉన్న విషయం తెలిసిందే. వినుకొండ ప్రాంతానికి చెందిన ఓ డీఈడీ కళాశాల యాజమానితో కలిసి అక్రమ వసూలు చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన సంఘటన అప్పట్లో రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ అధికారికి కర్త, కర్మ, క్రియగా పని చేసిన ఉద్యోగులు ఇప్పటికీ ఆర్‌జేడీ కార్యాలయంలో ఉన్నారు. ఇలా దాదాపు పది మందిపైగా ఉద్యోగులు నాలుగు నుంచి పదేళ్లకు పైగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఆయా ఉద్యోగులకు దశలవారీగా స్థాన చలనం కలిగించేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం

- వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ కరుణాసాగర్
- ఉత్సాహంగా వర్సిటీ క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జి.కరుణా సాగర్

బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదపడతాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్ తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్యపోటీలు ఆదివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో క్రీడలు అంతర్భాగాలన్నారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని, నిత్యం సాధన చేయాలని చెప్పారు. క్రీడలను ప్రోత్సహించడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన మౌలిక అవసరాలను గుర్తించి క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామన్నారు. విద్యార్థులు క్రీడలను తమ రోజువారి జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ గుంటూరు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం అపురూపమైనదని, ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, డాక్టర్ ఎన్జీఆర్ కాలేజి ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అసోసియేట్‌డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్, డాక్టర్ ఎన్జీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ స్మిత్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎందులో.. 'స్కిల్'

- వయసుల వారీగా సర్వే
- ఇప్పటికే యంత్రాంగానికి శిక్షణ పూర్తి
- క్లస్టర్ల వారీగా సచివాలయ ఉద్యోగులతో ప్రక్రియ
- ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు


నైపుణ్య గణనకు సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం(ఫైల్ ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఉపాధి కల్పన అనే ఊసే లేకుండా వైసీపీ ఐదేళ్ల పాలన సాగింది. దీంతో జిల్లాలో నిరుద్యోగుల సంఖ్య భారీగా పెరిగింది. యువతలో ఉన్న స్కిల్‌కు పదును పెట్టి వారు కోరుకున్న రంగంలోనే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిని అమలు చేసే విధంగా కార్యాచరణను ప్రభుత్వం ప్రారంభించింది. ఇంటింటికి తిరిగి వయసుల వారీగా స్కిల్ గణన చేపట్టడంతో పాటు వారి వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే విధంగా ప్రణాళికలు రచించింది. ఈ సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించడానికి తొలుత సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను అధికారులు చేపట్టారు. ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో కూడా స్కిల్ డెవలప్‌మెంట్ కింద భారీగానే నిధులను ప్రభుత్వం కేటాయించింది. నైపుణ్య గణనలో భాగంగా ఇప్పటికే చదువు పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్న వారితో పాటు ప్రస్తుతం చదువుతున్న వారి వివరాలు కూడా యంత్రాంగం సేకరించనుంది. సర్వేలో ప్రధానంగా విద్యార్హతలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులతో పాటు ప్రస్తుతం ఏ రంగంలో ఉపాధి పొందుతున్నారు.. దేనిలో రాణించాలని ఉంది లాంటి సమగ్ర వివరాలను సర్వేలో భాగంగా నమోదు చేయనున్నారు.

50 ఇళ్లు యూనిట్‌గా ఒక్కొక్కరికి ఖాతా కేటాయింపు

50 ఇళ్లను యూనిట్‌గా తీసుకుని సర్వే చేపట్టనున్నారు. ఆధార్ నంబరు ఆధారంగా వివరాలు నమోదు ప్రక్రియ ఉండడంతో పాటు మ్యాపింగ్ కూడా చేస్తారు. సర్వే పూర్తి కాగానే పోర్టల్‌లో నమోదైన ప్రతి ఒక్కరికీ ఒక్కో ఖాతా నంబరును కేటాయిస్తారు. దాని ఆధారంగా ఆ పోర్టల్‌లోకి వెళ్లి మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అభ్యర్థులకు వెసులుబాటు కల్పించింది. ఈ సర్వే మొత్తం సచివాలయ సిబ్బంది ద్వారానే జరగనుంది. ఇప్పటికే మండలానికి ఇద్దరి చొప్పున ఎంపిక చేసి కలెక్టరేట్‌లో స్కిల్ గణనపై శిక్షణ ఇచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు మండలం యూనిట్‌గా అక్కడ సర్వేలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. మూడు మండలాలు మినహా శిక్షణ కార్యక్రమం ఇప్పటికే పూర్తయింది. 15-59 ఏళ్ల మధ్య వయస్కులను ఆరు కేటగిరీల్లో విభజించి నైపుణ్య గణన చేపట్టే విధంగా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. చదువు పూర్తయి ఉద్యోగ వేటలో ఉన్నవారికి అక్కడ నమోదు చేసిన వివరాల ఆధారంగా సదరు కంపెనీకి ఆమోదం ఉంటే శిక్షణ కూడా వారే ఇచ్చి ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నది. ఇది కాదనుకుంటే ప్రభుత్వమే సదరు కంపెనీలకు కావాల్సిన విధంగా తర్ఫీదునిచ్చి వారిని సిద్ధం చేయనున్నది.

భారీ సంఖ్యలోనే నమోదు....

వయసుల వారీగా చూస్తే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 15 నుంచి 17 ఏళ్ల మధ్య ఉన్నవారి సంఖ్య దాదాపు మూడు లక్షల వరకు ఉండే అవకాశం ఉంది. అదే విధంగా 18-19 ఏళ్ల మధ్య వయసు వారి సంఖ్య రెండు లక్షల వరకు, 20–29 మధ్య ఏడు లక్షల వరకు, 30--39 మధ్య 9 లక్షల వరకు, 40-49 మధ్య 8 లక్షల వరకు, 50--59 మధ్య 5 లక్షల వరకు వివరాలు పోర్టల్‌లో నమోదయ్యే అవకాశం ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. స్కిల్ సర్వే ఆధార్‌కార్డు ఆధారంగానే జరగనుంది. ప్రభుత్వం దీర్ఘకాల వ్యూహంతోనే ఈ గణనకు తెరతీసినట్లు తెలుస్తోంది. జిల్లాలో వయసుల వారీగా ఉన్న మానవ వనరుల లెక్క అధికారికంగా తేలడంతో పాటు నిరుద్యోగుల సంఖ్యపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఈ సర్వే ద్వారా కలుగుతోంది.

సీఆర్‌జడ్‌కు.. చెల్లు

1 తీరంలో తిలాపాపం తలాపిడికెడు

1 నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

చీరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తీరంలో సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారులు అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారు. దీంతో చీరాల నియోజకవర్గ పరిధిలోని తీరప్రాంతంలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఒకరిని చూసి మరొకరు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. నియంత్రించాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అక్రమ నిర్మాణదారులు పలు సందర్భాల్లో సంబంధీకులకు తగిన మూల్యం చెల్లిస్తున్నామని చెప్తున్నారు.

అక్రమాలను సక్రమం చేసుకుందాం

తీరంలో జరిగే అక్రమ నిర్మాణాలను సక్రమం చేసుకుందాం. ప్రభుత్వం మనది. ఇబ్బంది లేకుండా అనుమతులు పొందుదాం. గతంలో మీరు సహకరించారు.. ఇప్పుడు మేం సహకరిస్తాం..' అనే కోణంలో అక్రమ నిర్మాణదారులు ఒప్పందాలు కుదుర్చుకుంటూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ వ్యవహారంలో పెద్దమొత్తాల్లో చేతులు మారుతున్నట్లు సమాచారం.

కప్పం కడితే.. ఓకే.. లేదంటే మీ ఇష్టం

తీరప్రాంతంలో జరుగుతున్న, జరిగిన కట్టడాలపై కప్పం కడితే ఎలాంటి ఇబ్బంది లేదని, లేదంటే ఇబ్బంది పడతామని నిర్వాహకుల అంతరంగిక సమావేశాల్లో చర్చ జరుగుతోంది. 'టీడీపీ అధికారంలో ఉంది. మమ్మల్ని కాదని ఏదన్నా చర్యలు చేపడితే అందుకు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది' అని అక్రమ నిర్మాణదారులు కొందరు సంబంధిత అధికారులను హెచ్చరించడం పరాకాష్టకు నిదర్శనంగా ఉంది. తీరప్రాంతంలో జరుగుతున్న భూముల క్రయ, విక్రయాలకు సంబంధించి నిబంధనలను పాటిస్తారా.. లేదంటే అతిక్రమణలపై చర్యలకు బాధ్యులు అవుతారా అన్నదానిపై జనాల్లో చర్చ జరుగుతోంది.


కఠారివారిపాలెం సమీపంలోని అక్రమ కట్టడం


రామాపురం తీరంలో అనుమతుల లేని నిర్మాణం

పోటెత్తిన భక్తజనం

- సూర్యలంక సముద్ర తీరం కిటకిట
- పౌర్ణమి కంటే ఎక్కువగా తరలివచ్చిన జనం
- 180 మంది పోలీసుల బందోబస్తు.. మరబోట్లు, డ్రోన్లతో గస్తీ



బాపట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరం పర్యాటకులు, భక్తులతో పోటెత్తింది. పవిత్ర కార్తీక మాసంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు బాపట్ల నుంచే కాకుండా దూరప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చిన భక్తుల పుణ్యస్నానాలతో సముద్రతీరం పులకరించింది. కార్తీక పౌర్ణమి రోజు కంటే ఎక్కువ మంది భక్తులు తరలిరావడంతో తీరం కిక్కిరిసిపోయింది. దీంతో 180 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్లతో, సముద్రజలాల్లో మరబోట్లపై గస్తీ, డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. స్నానాలు ఆచరిస్తున్న వారిని లోతుకు వెళ్ళనీయకుండా అప్రమత్తం చేస్తూ మైక్‌లో పోలీసు సిబ్బంది సూచనలు చేశారు. అలల తాకిడికి కొట్టుకుపోతున్న వారిని కాపాడారు. డీఎస్పీ రామాంజనేయులు, సీఐలు గంగాధర్, హరికృష్ణ, మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసరావు, శ్రీనువాసులు, ఏఎస్‌ఐ అమరేశ్వరరావు తదితరులు భద్రతా ఏర్పాట్లలో పాల్గొన్నారు.


సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం



బంగారు పతకం సాధించిన నాగరాజు, సాంబశివరావు (మధ్యలోఉన్నవారు)

అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా

» బంగారు పతకం సాధించిన హెడ్ కానిస్టేబుల్ నాగరాజు
» పరుగు పందెంలో సాంబశివరావుకు గోల్డ్‌మెడల్

చీరాలటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ 40 ప్లస్ విభాగంలో చీరాల టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ నాగరాజు సత్తా చాటారు. షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, జావెలిన్ త్రోలో సిల్వర్ మెడల్ సాధించారు. గత శుక్రవారం నుంచి ఆదివారం వరకు వెస్ట్ బెంగాల్‌లోని న్యూ కూచ్ బీహార్ స్టేడియంలో జరిగిన పోటీల్లో నాగరాజు ఉత్తమ ప్రదర్శన కనబరించారు. అలాగే చీరాల మండల పరిధిలోని సిండికేట్ వీవర్స్ కాలనీకు చెందిన సివిలియన్ అడిగోపుల సాంబశివరావు 45 ప్లస్ విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెం విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. సుమారు 5 దేశాల నుంచి పోటీల్లో క్రీడాకారులు పాల్గొనగా, చీరాల ప్రాంతం నుంచి గర్వించదగేలా ఘనతను చాటిన ఇద్దరినీ పలువురు అభినందిస్తున్నారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం

» ప్రత్యేక హారతులు, అన్నదాన కార్యక్రమాలు

బల్లికురవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో ఉన్న హనుమాన్ సాయి మందిర వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా దేవాలయానికి పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సాయికి అభిషేకాలు చేసి, హారతలిచ్చారు. కార్తీక మాసం కావడంతో బల్లికురవ, గుంటుపల్లి, కొత్తపాలెం, నాగరాజుపల్లి, అంబడిపూడి, కొండాయపాలెం, కొణిదెన, చెన్నుపల్లి, వల్లాపల్లి గ్రామాల నుంచి భక్తులు విరివిగా తరలి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్థులు, దేవాలయ కమిటీ సభ్యులు, సాయి సేవకులు వెంకటేశ్వరరెడ్డి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. సాయినాథుని విగ్రహ గ్రామోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకపోతే కేసులు

బల్లికురవ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని బల్లికురవ ఎస్‌ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. ఆదివారం విజువల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లాయపాలెం రోడ్డు వద్ద ఎస్‌ఐ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీలు చేశారు. ఈసందర్భంగా వాహనదారులతో అయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పత్రాలు, ఇన్స్యూరెన్స్ పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై చర్యలు తప్పవు అన్నారు.

పథకాలు అర్హులకు అందేలా చూడాలి

అద్దంకిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు చూడాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు సమావేశాలకు రాకపోవడాన్ని కోటికలపూడి సర్పంచ్ విక్రమ్ ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. చక్రాయపాలెం సర్పంచ్ నగేష్ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు.

మేదరమెట్ల : ఐక్యతతో మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. ఆదివారం కొరిశపాడు మండల పరిషత్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలలో చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు గురించి అధికారులు వివరించారు. ఉపాధి నిధులతో జరుగుతున్న పనులు నాణ్యతతో చేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణ, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అద్దంకిలో రెండు ఇళ్లలో చోరీ

» 38 సవర్ల బంగారం, రూ.54వేలు అపహరణ
» కుటుంబసభ్యులు నిద్రిస్తుండగానే దొంగతనం
» బెంబేలెత్తుతున్న ప్రజలు



విశ్వభారతి స్కూల్ సమీపంలో చోరీ జరిగిన ఇంట్లో చిందవందరగా ఉన్న బీరువా

అద్దంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగానే రెండు ఇళ్లల్లో చోరీలు జరిగి పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితుల కథనం మేరకు పట్టణంలోని కాకానిపాలెం ఆర్టీసీ ఉద్యోగి నరిశేటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయిని కవిత దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా దొంగలు ఇంటి గొంది తలుపు గడియను కిటికీ గ్రిల్స్ లోగుండా తీసి ఇంట్లోకి ప్రవేశించారు. దంపతులు నిద్రిస్తున్న గదిలో ఉన్న సుమారు 18 సవర్ల బంగారం ఆభరణాలు, రూ.4వేల నగదును దొంగలు శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత అపహరించుకుపోయారు. డూప్లెక్స్ ఇల్లు కావడంతో పై అంతస్తులో కూడా దొంగలు వెతికారు. ఉదయం నిద్ర లేచి చూసే సరికి చోరీ జరిగినట్లు గుర్తించారు. విశ్వభారతి కళాశాల సమీపంలో తిమ్మాయపాలెం హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.బాబూరావు, ఎన్నెస్పీ ఉద్యోగిని పద్మలత దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగా దొంగలు వెనుక వాకిలిని కిటికీ లో గుండి తెరిచి ఇంట్లోకి ప్రవేశించా రు. దంపతులు నివశిస్తున్న పక్క బెడ్ రూమ్‌లో బీరువాలు తెరిచి శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీకి పాల్పడ్డారు. సుమారు 20 సవర్ల బంగారం ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. నిద్రిస్తున్న బెడ్ రూమ్‌లోని బాబూరావు షర్ట్, ప్యాంట్‌లను పక్క బెడ్ రూమ్‌లోకి దొంగలు తీసుకు వచ్చి పడవేశారు. సమీపంలోని మరో ఇంట్లో కూడా చోరీకి ప్రయత్నం చేశారు. చోరీలు జరిగిన ఇళ్లను సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్‌బాషా ఆదివారం పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందం ఆయా ఇళ్లల్లో దొంగల వేలిముద్రలను సేకరించారు. అయితే రెండు ఇళ్లల్లో చోరీలు జరిగిన తీరు ఒకే విధంగా ఉంది.

గత రెండు నెలలలో అద్దంకి పట్టణంలోని పలు ఇళ్లల్లో జరిగిన ఐదారు చోరీలు కూడా ఇదే తీరులో ఇంట్లో కుటుంబసభ్యులు నిద్రిస్తుండగానే కిటికీలలో నుంచి తలుపు లోపల గడియలను తొలగించి చోరీలకు పాల్పడ్డారు. ఇంట్లో కుటుంబసభ్యులు నిద్రిస్తుండగానే చోరీలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

చేసేదే చెప్తాం..చెప్పింది చేస్తాం

ఎమ్మెల్యే కొండయ్య



మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య తదితరులు

చీరాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా ప్రయోజనాలకు చెప్పింది చేద్దాం. చేసేది చెప్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తదితరులు ఉద్ఘాటించారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం రాత్రి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, రాష్ట్ర లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్, చీరాల నియోజకవర్గ పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యులు డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్ సభా నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. వైసీపీ ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలో కొనసాగుతున్న పాలనా తీరుకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వారు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలనతో ప్రజలకు ఒనగూరుతున్న ప్రయోజనాలను వివరించారు. ముందుగా చీరాల మండలం ఈపురుపాలెం నుంచి అంబేడ్కర్ భవన్ వరకు నాయకులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. సభకు ముందుగా మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

శస్త్ర చికిత్సకు 219 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు, హాజరైన ప్రజలు

యద్దనపూడి (మార్టూరు) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రీ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఏలూరి ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. భారీగా ప్రజలు హాజరయ్యారు. సుమారు 672 మంది ప్రజలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 219 మందికి కంటి శస్త్ర చికి త్స అవసరంగా గుర్తించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత టీడీపీ మండల నాయకులు ఎన్టీఆర్ విగ్రహంతో పాటు స్వర్గీయ ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు స్త్రీ, పురుషులకు వేరువేరుగా ఏర్పాటు చేసిన ఓపీ కౌంటర్ల వద్ద శంకర్ కంటి ఆస్పత్రి వైద్య బృందం పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజా నాయకునిగా లక్ష మందికి కంటి ఆపరేషన్‌లు చేయించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారన్నారు. వైద్య శిబిరం అనంతరం వచ్చినవారందరికీ భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొట్టిపాటి రాంబాబు, రంగయ్యచౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, తారకరామారావు, రావిపాటి సీతయ్య, బోయపాటి సాంబశివరావు, ఈదల అనిల్, సింగు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు మంత్రి గొట్టిపాటి ప్రశంస

అద్దంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును పూర్తి చేసిన గ్రామ నేతలను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసించారు. నియోజకవర్గంలోని కుర్రావానిపాలెం, విప్పర్లవారిపాలెం, అద్దంకి పట్టణంలోని 176వ నెంబర్ బూత్‌ల నేతలకు వారికి కేటాయించిన సభ్యత్వాలను పూర్తి చేయడంతో గొట్టిపాటి ఫోన్ చేసి ప్రశంసించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించటం, గ్రామ, వార్డు లలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయడం మంచి పరిణామం అన్నారు.

కవి సమ్మేళనం

అద్దంకి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ, సృజన ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులకు హ్యాండ్‌రైటింగ్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. గ్రంథాలయానికి రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ద్వారా దివాకరదత్ హ్యాండ్‌మైక్ సెట్ స్పీకర్‌ను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుగుణరావు, డాక్టర్ దేవపాలన పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పంచేవి గ్రంథాలయాలు

చినగంజాం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : విజ్ఞానాన్ని అందించే పుస్తక భాండాగారాలు గ్రంథాలయాలని జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు అన్నారు. ఆదివారం కవి సమ్మేళనం, రచయితల సందేశాల కార్యక్రమాలను నిర్వహించారు. కవులు చుండూరి వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరశాస్త్రిని గ్రంథపాలకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు, ఉపాధ్యాయులు, వాసవీ సభ్యులు సన్మానించారు. కవి వెంకటేశ్వర్లు రాసిన ప్రణయ సుందర దృశ్యం అనే పుస్తకాన్ని గ్రంథాలయానికి బహూకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోతురాజు, వై.రామాంజనేయులు, షేక్ నాయబ్ రసూల్, వనితా మండల అధ్యక్షురాలు సుచిత్ర పాల్గొన్నారు.

గ్రామాల్లో అవగాహనతో వైద్యం అందించాలి

అద్దంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు కొత్త వ్యాధులపై అవగాహనతో వైద్యం అందించాలని గుంటూరు లైఫ్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ కొసరాజు కమలాకర్, డాక్టర్ దుర్గా ప్రసాద్ అన్నారు. షాదీఖానాలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో వి.సుబ్బారావు, వలి, చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభ్యుదయభావాల గ్రామం గంగవరం



మాట్లాడుతున్న కృష్ణయ్య

ఇంకొల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరంలో ఎక్కువ మంది అభ్యుదయభావాలు కలిగి, సేవాదృక్పథంతో సేవందించే వారు ఉన్నారని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య అన్నారు. ఆదివారం గంగవరంలో మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ కల్యాణ మండపంలో జరిగిన మంచాల రవి సంస్మరణసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మంచాల వెంకట్రామయ్య కుమారులు డాక్టరు రమేష్ బాబు, రవి గ్రామానికి అందించిన సేవలను కొనియాడారు. రవి ధార అనే స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి అంతర్జాతీయంగా ఆయన మిత్ర బృందంతో పేదలకు సేవందించేలా ముందుకు సాగారన్నారు. గ్రామానికి సేవలందించిన పలువురు ప్రముఖుల గురించి ప్రస్తావించారు. ఆ నాడు వలేటి కుటుంబీకులు గ్రామంలో శ్రీవలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయడంతో ఎంతో మంది ప్రయోజకులయ్యారన్నారు. అనంతరం షుగర్ వ్యాధిగ్రస్తులకు గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక వారు వైద్య శిబిరం నిర్వహించి మందులను అందజేసారు. రైతు సంఘ సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు రమాదేవి, ఏలూరి సిద్దయ్య, సీఐటీయూ రైతు సంఘం నాయకులు, కరి కమలేశ్వర రావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



భవానీ సెంటర్‌లో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

» చీరాల డీఎస్పీ మొయిన్

అద్దంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చీరాల డీఎస్పీ మొయిన్ అన్నారు. అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న నేపథ్యంలో ఆదివారం పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. మరలా స్థానికులు ఇతర వర్గాల ప్రజలతో చర్చించి ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామన్నారు. పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల గురించి అధికారులతో చర్చించారు. మండలంలోని ధర్మవరంలో కొనసాగుతున్న పికెట్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. వర్గ విభేదాలు ఉన్న గ్రామాలపై పోలీస్‌లు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని, అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య ఎస్సైలు ఖాదర్‌బాషా, ప్రవీణ ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి

చీరాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : రోగుటకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు నిర్దిష్ట కార్యాచరణతో పనిచేస్తామని ఏరియా వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి తెలిపారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో అన్నీ సమకూర్చితే ప్రైవేటు కన్నా మిన్న అన్న శీర్షికన ప్రచురితమైన కథనంపై డాక్టర్ సుభాషిణి స్పందించారు. వైద్యశాలలో ఐదు విభాగాలకు వైద్యుల కొరత ఉందన్నారు. ఎముకలు, కీళ్లు, సీఎస్ ఆర్ఎంవో, పీఎస్ఎస్ జనరల్ వైద్యుల పోస్టులు, కంటి వైద్యనిపుణులు, చెవి, ముక్కు, గొంతు వైద్యులు ఉపనియామకమై ఉన్నారు. ఈ ఐదు పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. 100 పడకల ఆసుపత్రిలో 12 మంది భద్రతా సిబ్బంది, 23 మంది పారిశుద్య కార్మికులు మాత్రమే ఉన్నారు. రోగులకు అనుగుణంగా ఈ సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. పోస్టుమార్టంకు డబ్బు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మహాప్రస్థాన వాహనాల పునరుద్ధరణకు కమిషనర్‌కు నివేదించినట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి తెలిపారు.

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

చీరాలటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ అధికారులు మండల పరిధిలో ఆదివారం దాడులు నిర్వహించారు. బుర్లవారిపాలెంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 12 సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

వ్యక్తి కిడ్నాప్‌నకు యత్నం

» వెంబడించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

చినగంజాం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తి కిడ్నాప్ యత్నాన్ని పోలీసులు అడ్డుకున్న సంఘటన చినగంజాం పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శీలం రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని మున్నంవారిపాలెం పంచాయతీ బేతాళవారిపాలెం గ్రామానికి చెందిన పిల్లి వెంకటకృష్ణారావు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఎనలిస్టుగా ఉంటూ ఫేస్‌బుక్‌ల్లో లింకులు ఇస్తూ కమీషన్ పొందుతూ ఉంటాడు. పదిరోజుల కిందట హైదరాబాద్‌కు చెందిన రియాజ్ అనే అతను రాజేశ్వరి అనే పేరుతో ఉన్న ఫేస్‌బుక్ నుంచి వెంకటకృష్ణారావుకి హాయ్ చెప్పారు. నేను కూడా ట్రేడింగ్ చేయాలనుకుంటున్నాను, నాదగ్గర యూఎస్ డాలర్స్ ఉన్నాయని మెసేజ్ పంపాడు. సరే చేయండని కృష్ణారావు రియాజ్‌కి లింక్ పంపాడు. ఆ లింకు మీద రెండు రోజులు ట్రేడింగ్ ఎలా చేయాలనే దాని మీద ఆన్‌లైన్‌లో రియాజ్‌కు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 12వ తేదీన వెంకటకృష్ణారావు ఫోన్ చేసి నా యూఎస్ డాలర్స్ నీకు పంపిచాను చూడు అని రియాజ్‌కు చెప్పారు. అది నేను స్క్రీన్‌షాట్ చేసి చూస్తానని రియాజ్ చెప్పి, వెంకటకృష్ణారావు చూసేసరికి ఆ స్క్రీన్ షాట్ డిలీట్ చేయడంతో దానిని ఎందుకు డిలీట్ చేసావని రియాజ్‌ని వెంకటకృష్ణారావు అడగగా, రియాజ్ డాలర్స్ మిస్ అయ్యాను దానికి నువ్వేకారణమని మాట్లాడాడు. ఈ క్రమంలో రియాజ్ తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఆరుగురు వ్యక్తులను రెండు కార్లలో పంపించి వెంకటకృష్ణారావుని తీసుకుని రమ్మని చెప్పగా వాళ్లు ఆదివారం ఉదయం మున్నంవారిపాలెం వచ్చి వెంకటకృష్ణారావును కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లారు. బాధితుడి బావ హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంటనే వారిని వెంబడించి పిడుగురాళ్ల సమీపంలో ఇద్దరిని, రాష్ట్ర సరిహద్దులో నలుగురిని పట్టుకున్నారు. శ్రీపాద కిరణ్ (హైదరాబాద్, బోడుప్పల్) గుర్రం ఆనంద్‌కుమార్, ఉప్పల్, కరెంట్ కోటి కల్కి, చంగిచర్ల, నాగం నరేందర్, బోడుప్పల్, బూడారం లక్ష్మారెడ్డి, ఉప్పల్, జేసాయికుమార్, ఉప్పల్ అదుపులో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా కార్తీక వనసమారాధనలు

పెద్దఎత్తున పాల్గొన్న ఆర్యవైశ్య, బ్రాహ్మణ కుటుంబాలు



బ్రాహ్మణ కార్తీక సమారాధనలో ప్రసంగిస్తున్న లక్ష్మీనారాయణ

అద్దంకి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కార్తీక వనసమారాధనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. శింగరకొండలోని ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రంలో ఆదివారం ఆర్యవైశ్యుల కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ సుబ్బారావు దంపతులు, గునుపూడి నవీన్ ఆధ్వర్యంలో రమా సత్యనారాయణ స్వామి వ్రతం, విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకున్నాయి. అనంతరం వనభోజనాలు చేశారు. కమిటీ అధ్యక్షుడు శ్రీరాం నాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తీక సమారాధన ఘనంగా నిర్వహించారు. చందలూరు మహాలక్ష్మి అమ్మవారి పీఠం నిర్వాహకులు కోట లక్ష్మీనారాయణ కార్తీక మాస విశిష్టత ను వివరించారు. ఆరామ క్షేత్రం విరాళం దాతలను ఘనంగా సన్మానించారు. జమ్ముల మడక హనుమంతరావు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, వామరాజు వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, శివప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడుకు నివాళులర్పించిన బలరాం



నివాళి కార్యక్రమంలో పాల్గొన్న బలరాం

చీరాల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు సోదరుడు మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు మృతికి మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆదివారం చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో రామ్మూర్తినాయుడు మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ సీనియర్ నేత కరణం బలరాంకు నమస్కరిస్తూ పలకరించారు. సీఎం చంద్రబాబు, కరణం బలరాం మధ్య కొద్దిపాటి సంభాషణ జరిగింది.

సోషల్ మాధ్యమాలపై పోలీసుల దృష్టి

చీరాలటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యూ ట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా, వాట్సాప్ వంటి సోషల్ మాధ్యమాలపై చీరాల పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు అప్రమత్తమయ్యారు. ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టించే విధంగా వచ్చే ప్రేరేపిత పోస్ట్‌లపై విధిగా దృష్టి సారిస్తున్నారు.

నారా రామ్మూర్తి నాయుడుకి ఘన నివాళులు



కందుకూరులో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడి చిత్రపటానికి పార్టీ నాయకులు. కార్యకర్తలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీనివాసరావు, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను, షేక్ ఫిరోజ్, పులి నాగరాజు, మేడ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం నారా రామ్మూర్తినాయుడి చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, సయ్యద్ సందానీ, మతకాల శ్రీనివాసులు, నరసయ్య, ప్రసాద్, ఉప్పుటూరి వెంకటయ్య, సీహెచ్ శివకృష్ణ, మట్ల నాగయ్య, జీ.వెంకటేశ్వర్లు, జల్సాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెంచలబాబు యాదవ్ నివాళి

కాగా, చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లిలో నారా రామ్మూర్తినాయుడు భౌతిక కాయాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ సందర్శించి ఘన నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌బాబులను కలిసి సానుభూతి వ్యక్తం చేశారు.

●సీతారామపురం: స్థానిక గ్రామ పంచాయతీలోని టీడీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు ఆధ్వర్యంలో మండల నాయకులు ఆదివారం నారా రామ్మూర్తినాయుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజశేఖర్, ఎస్సీ సెల్ కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి జాషువా, కులారి సుబ్బయ్య, రఘు, మురళి తదితరులు పాల్గొన్నారు.

● జలదంకి : సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు చిత్రపటానికి స్థానిక టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, గుర్రం ప్రవీణ్‌లు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొండాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు రామమూర్తి నాయుడు మృతి పార్టీకి తీరనిలోటని టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ కోసం అనేక సేవలు చేశాడన్నారు.

సమస్యలపై చర్చించి పరిష్కరిస్తాం: ఎంపీపీ



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మల్లారెడ్డి

కావలి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి తెచ్చిన ప్రజా సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని ఎంపీపీ ఆలూరు కొండమ్మ తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో ఎంపీపీ కొండమ్మ అధ్యక్షతన ఆదివారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అన్నిశాఖల అధికారులు హాజరు కాగా ఎమ్పీటీసీలు 9మంది మాత్రమే హాజరయ్యా రు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి ఎన్.మల్లారెడ్డి, ఎమ్పీడీవో శ్రీదేవి మాట్లాడారు. రానున్నది వర్షాకాలమని సీజనల్ వ్యాధులతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలాభివృద్ధికి అన్నిశాఖల అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం 21 శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదపట్టపుపాలెం ఎమ్పీటీసీ గంగన్నగారి యాదగిరి మాట్లాడారు. చెన్నాయపాలెం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను కోరగా డీఎం దృష్టికి తీసుకువెళ్లి పరష్కరిస్తామన్నారు. తుమ్మలపెంట పంచాయతీ కార్యదర్శి నరేంద్ర తమ పంచాయతీలో విద్యుత్ స్తంభాలను 3వ లైన్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. 2018లో ఈఈఎస్ఎల్ సంస్థ మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎల్ఈడీ వీధిలెట్లు వేసి తుమ్మలపెంటలో మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పామంజి రాజయ్య, అరగల కవిత, కోఆప్షన్ సభ్యులు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా డే కేర్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయంలోని రెడ్‌క్రాస్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన తలసేమియా డే కేర్ సెంటర్ భవనంను ఆదివారం ఎమ్మెల్యే దుగమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం చికిత్స పొందుతున్న తలసేమియా బాలికలను పరామర్శించి బాధితులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. అలాగే నూతనంగా ఆధునీకరించిన రెడ్‌క్రాస్ రక్తకేంద్రం భవనంను రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ ఆరుమళ్ల శ్రీధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. వీరి వెంట రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. ఈసందర్భంగా యంత్ర పరికరాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ బెజవాడ రవికుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తనకు ఇప్పటివరకు రెడ్‌క్రాస్ అంటే కేవలం రక్తసహాయం చేసే సంస్థగా నే తెలుసని కావలి రెడ్‌క్రాస్‌లో 12రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని ఇప్పుడే తెలిసిందన్నారు. వీరి సేవలకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కావలిలో రానున్న పలు కంపెనల గురించి వివరించారు. పరిశ్రమలు వస్తే కావలి యువతకు ఏడాదికి 2వేల ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను రెడ్‌క్రాస్ బాధ్యులు సన్మానించారు. అలాగే రెడ్‌క్రాస్‌కు విరాళాలు అందించిన 28 మంది దాతలను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు మన్నెమాల గోవిందరెడ్డి, రవిప్రకాష్, హరినారపరెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, స్వర్ణలత, గ్రంధం ప్రసన్నాంజనేయులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్య పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనంతసాగరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు నారాయణరావు, జేవీవీ నాయకులు వేము పెంచలయ్య, సచివాలయ సోషల్ వెల్ఫర్ అసిస్టెంట్ బీ మురళి పాల్గొన్నారు.

ఎన్నాళ్లు ఈ ట్రాఫిక్ కష్టాలు



ఆత్మకూరులో ట్రాఫిక్ సమస్యతో నిలిచిపోయిన వాహనాలు

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతో అవస్థలు తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పూర్తిస్థాయిలో విస్తరణకు నోచుకోకపోవడంతో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

రోడ్డువిస్తరణకు అడ్డంకులు

ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్ నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు నాలుగురోడ్ల రహదారి పనులు పూర్తయి మధ్యలో సెంట్రల్‌లైటింగ్, పూలమొక్కలు పెంచేవిధంగా ఆధునీకరించాలని గత మున్సిపాలిటీ పాలకవర్గం నిర్ణయించింది. అయితే రోడ్డు విస్తరణ పనులు నెల్లూరుపాళెం సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు పూర్తయ్యాయి. అక్కడి నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు రోడ్డువిస్తరణకు అడ్డంకులు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా విస్తరణకు సంబంధిత భవనాల యజమానులు అంగీకరించకపోవడంతో పదేళ్ల నుంచి రోడ్డుపనులు నిలిచిపోయాయి. దాంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. దానికితోడు ట్రాఫిక్ సమస్య తీవ్రతరవుతోంది. ఆ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రతిరోజు ట్రాఫిక్ నిలిచిపోతోంది. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యంగా ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాల నిలిపివేతను అరికట్టడంతో పాటు రోడ్డు విస్తరణను పూర్తిచేయాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

117 జీవో రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలి

● యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ



సీతారామపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ఉదయగిరి రూరల్, నవంబరు 17: ప్రభుత్వం 117 జీవోను రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పీఆర్సీ కమిటీ వేసి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల యూటీఎఫ్ మహాసభ నిర్వహించారు. ఈసభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ సభ్యులు తప్పక ఎఫ్‌డబ్ల్యూఎఫ్‌లో సభ్యుడిగా చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా షేక్ కరీముల్లా, అధ్యక్షుడిగా వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఎండీ హనీఫ్‌లను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న షేక్ సందానిబేగం, షేక్ సబియాసుల్తానా, షేక్ ఖాదర్‌బాషాలను మండల శాఖ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె చంద్రశేఖర్‌రెడ్డి, నాయబ్, అంజాద్, గౌస్‌బాషా, ఏడుకొండలు, జాఫర్‌సా, రజియాబీ, ఫణిరాజ్, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత ఎంఈవోలు, ఉపాధ్యాయులకు సన్మానం

●వరికుంటపాడు : స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో విశ్రాంత ఎంఈవోలు, ఉపాధ్యాయులు, శాఖ బాధ్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. మృతిచెందిన వారి కుటుంబీకులకు కుటుంబ సంక్షేమ నిధి బాండ్లను అందించారు. అనంతరం యూటీఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆర్ వెంకటేశ్వర్లు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎల్‌వీ నారాయణ, వీవీ సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా పీ మనోహర్, సీహెచ్ శ్యామల, కోశాధికారిగా డీ చంద్రమౌళి, జిల్లా కౌన్సిలర్లు, తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శి షేక్ ఖాజావలి నూతన కార్యవర్గం చేత ప్రతిజ్ఞ చేయించారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

● సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడమ తిరుపతయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సభలో మండల యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా షేక్ గాజుల రంతుజాని, అధ్యక్షులుగా బోగ్యం శ్రీనివాసులు, సహాధ్యక్షులుగా సారె సురేష్, పిపిపి కుమారి, ప్రధాన కార్యదర్శిగా గొడ్డవేటి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఓంకారం నరసింహరాజు, మహిళా కార్యదర్శిగా పార్వతి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ మహేష్, ఆడిటర్ ఆనందీశ్వరయ్య, జిల్లా కౌన్సిలర్స్ పేరాల శ్రీనివాసులు, డి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించి కమిటీ రిపోర్ట్ వచ్చేలోపు 30శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డిఏలను ప్రకటించాలని, గత ఐదు సంవత్సరాల కాలంలో రావాల్సిన డిఏ అరియర్స్‌ను విడతల వారీగా చెల్లించాలని, పాఠశాల గ్రాంట్స్‌ను వెంటనే అకౌంట్లలో జమ చేయాలని పలు తీర్మానాలు చేశారు.

మహారాష్ట్రలో పవన్‌ను కలిసిన బొల్లినేని



పవన్‌కల్యాణ్‌ను కలిసిన బొల్లినేని

జలదంకి, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లా బల్లార్‌పూర్‌లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల ప్రచారంలో పాల్గొన్న జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను ఆదివారం టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకటరామారావు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయన వెంట చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, బొల్లినేని ఉన్నారు.

భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

చేజర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు కమిటీ సభ్యులు ఆదివారం ఆదురుపల్లి, కొలపనాయుడుపల్లి గ్రామాలలో ప్రచారం చేశారు. వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు జి.పెంచల నరయ్యా బి కిష్టయ్య పాల్గొన్నారు.

20న వాహనాల వేలం

ఆత్మకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు వాహనాలకు ఈనెల 20వ తేదీ 11 గంటలకు వేలం నిర్వహిస్తామని ఎస్‌ఐ షేక్ జిలాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బజాజ్ పల్సర్ బైకు, టయోటా ఇటియోస్ కారును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దారు సమక్షంలో వేలం వేయనున్నామని, ఆసక్తి గలవారు వేలంలో పాల్గొని వాహనాలను దక్కించుకోవచ్చని ఆయన తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

● డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ ట్రాఫిక్ నియంత్రణలో వ్యాపార సంస్థల యజమానుల సహకారం ఉండాలని అందుకు వారికి తమవంతు సహకారం అందిస్తామని కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో వారితో సమావేశమై మాట్లాడారు. పోలీసుశాఖ తరుపున కొన్ని నిబంధనలు, సూచనలు ఇచ్చారు. షాపులు, గోడౌన్లలో వస్తు సామగ్రిని వాహనాలతో లోడ్, అన్‌లోడ్ చేసుకునేవారు ఉదయం 8గంటల లోపు అనంతరం రాత్రి 9 గంటల చేసుకోవాలన్నారు. ప్రతిషాపు ముందున్న ఫుట్‌పాత్ మీద ఫ్లెక్సీలు, బోర్డులు, వస్తు ప్రదర్శన చేయరాదన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలం వదులుకోవాలన్నారు. రాకపోకలకు ఆటంకంగా మారిన అక్రమ కట్టడాలను తొలగించాలన్నారు. ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలు షాపుల ముందు నిలిపితే షాపుల యజమానులదే బాధ్యత అన్నారు. సీసీ కెమెరాలతో షాపు పరిధిలోని ప్రాంతాలను కవర్ చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్ఐ సాంబశివయ్య తదితరులు ఉన్నారు.

వర్షాలకు నిండని చెరువులు

● వరిపైరు సాగుపై రైతుల్లో ఆందోళన



బీడు భూమిని తలపిస్తున్న రాజుపాలెం పెద్ద చెరువు

ఉలవపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని చెరువులు ఆశించినస్థాయిలో నిండలేదు. సాధారణంగా వరిసాగు రైతులు అక్టోబరు, నవంబరు నెలల్లో నారుమడులు పోస్తుంటారు. అలాంటిది చెరువుల్లో నీరు లేకపోవడంతో ఆయకట్టు రైతులు వరిసాగుపై ఆలోచనలో పడ్డారు. వర్షాలపై ఆధారపడ్డ చెరువులు కావడంతో దిగువ ఉప్పుటేరు ఆనకట్ట పారుదలతో భీమవరం, బద్ధిపూడి చెరువులు నిండుతాయి. అదేవిధంగా మన్నేరు ఆనకట్ట ఆధారింతంగా కరేడు చెరువు, చాగొల్లు గోగుల చెరువు, పెద్దపట్టపుపాలెం జమ్ముల చెరువులు నిండుతాయి. రామాయపట్నం, వీరేపల్లి పెద్ద, చిన్న చెరువులు, సుబ్బరాయుడి సత్రం సీతమ్మ చెరువులు చుట్టుప్రక్కల పడిన వర్షం నీటితో నిండుతాయి. మండలంలో ఇటీవల కురిసిన వర్షం 130 మి.మీ నమోదు అయినా ఒక్క కరేడు చెరువు 80 శాతం నిండగా మిగిలిన చెరువులు 30 శాతం నిండుకున్నాయి. రాజుపాలెం పెద్ద చెరువులో నీరు లేక బీడు భూమిని తలపిస్తుంది. దీనికి భీమవరం చెరువు నుంచి సప్లయ్ చానల్ ఉన్నా భీమవరం చెరువు పూర్తిగా నిండితేగాని రాజుపాలెం పెద్ద చెరువుకు నీరు చేరదు. ఈ చెరువుకి ఎగువన ఉన్న ఫారెస్టు భూముల్లో కురిసిన వర్షం కొంత మేర చెరువుకు చేరుతుంది కానీ ఫారెస్ట్ భూముల చుట్టూ కందకాలు తీయడంతో ఆ నీరు నిలిచిపోయింది. ఈ ఏడాది చెరువుల కింద సుమారు 10వేల ఎకరాలలో వరి పంట సాగు ప్రశ్నార్థకంగా మారింది.

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం

చెరువులకు వెళ్లే కాలువల పూడికతీతలు, ఆనకట్ట గేట్లు మరమత్తులు చేయకపోవడంతో మొదటి రెండురోజులు కురిసిన వర్షపు నీరు చెరువులకు చేరకుండా వృథా అయిందని రైతులు ఇరిగేషన్ అధికారులను తప్పుపడుతున్నారు. సకాలంలో అధికారులు స్పందించి ఉంటే కరేడు, భీమవరం, బద్ధిపూడి, చాగొల్లు చెరువులు పూర్తిగా నిండి ఉండేవని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న షైన్ ఫౌండేషన్ సభ్యులు

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): షైన్ ఫౌండేషన్ సభ్యులు పట్టణ శివారుప్రాంతంలోని నిరుపేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు రహీమ్, ప్రతినిధులు నయామ్ భాష, రసూల్, మస్తాన్, వెంకటేశ్వర్లు, బాబు ఉన్నారు.

గ్రామాల్లో జోరుగా బెల్టు షాపులు

వింజమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపడియతోపాటు పరిసర గ్రామాల్లో జోరుగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని కూల్‌డ్రింక్ షాపులు, చిన్నచిన్న వ్యాపారులు వీటిని నిర్వహిస్తూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆలయాలు, బస్‌షెల్టర్లు, అంగన్‌వాడీ భవనాల్లో మద్యం సేవిస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మార్చుతున్నారు. దీంతో బడికి వచ్చే పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే రోడ్డుపై చేరి గొడవలు పడుతున్నారు. ఫలితంగా మహిళలు, వృద్ధులు రోడ్లపైకి వచ్చేందుకు జంకుతున్నారు.

క్రీడాకారుడికి స్పోర్ట్స్ షూ వితరణ

కందుకూరు, నవంబర 17 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది మాదాల మనోజ్ కుమార్ ఆదివారం రూ.8వేల స్పోర్ట్స్ షూను అథ్లెటిక్ ముప్పరాజు మహేష్‌కు బహూకరించారు. ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభావంతుడైన యువ అథ్లెటిక్ దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నాడని తెలుసుకుని ఈ చేయూత నిచ్చానని మాదాల తెలిపారు. మహేష్ కావలి జవహర్ భారతి కాలేజీలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

సంగం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బలో ముగ్గురు పేకాటరాయుళ్లను ఆదివారం సంగం పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామంలోని ఊరి చివర ఇసుక దిబ్బల్లో పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు ఎస్ఐ రాజేష్ పోలీసులతో జూద స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 5200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేరకు వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

18 ఏళ్లు పైబడిన వారందరికీ కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

ఎం శివకల్పన, వైద్యాధికారి, గండిపాళెం పీహెచ్‌సీ



ఉదయగిరి రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీ-సీడీ 3.0 స్ర్కీనింగ్ సర్వేలో భాగంగా రోజుకు ఐదు గృహాల చొప్పున 18 ఏళ్ల పైబడిన వారందరికీ కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం శివకల్పన తెలిపారు.

? పీహెచ్‌సీకి రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు.

! పీహెచ్‌సీకి రోజుకు 60 మంది రోగులు వస్తున్నారు.

? జ్వరపీడితులకు ఎలాంటి వైద్యసేవలు అందిస్తున్నారు.

! జ్వరంతో బాధపడేవారికి పీహెచ్‌సీలో అన్నిరకాల రక్తపరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నాం. జ్వరాలు సోకితే వెంటనే వైద్యశాలకు రావాలని అవగాహన కల్పిస్తున్నాం.

? సిబ్బంది, మందుల కొరత ఏమైనా ఉందా.

! సిబ్బంది, మందుల కొరత లేదు.

? విద్యార్థులకు వైద్యసేవలందిస్తున్నారా.

! ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్త్ స్ర్కీనింగ్ నిర్వహించి విద్యార్థులు, చిన్నారులకు వైద్యసేవలు అందిస్తున్నాం.

న్యూస్ బాక్స్

ఆదిదంపతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

ఉలవపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కరేడు గంగా జ్ఞాన ప్రసూనంబ సమేత కాళహస్తీశ్వర స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామస్థులు కళ్యాణం తిలకించేందుకు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉభయదాత కొలగట్ల శంకర్‌రెడ్డి భక్తులకు అన్నవితరణ చేపట్టారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

సంగం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

కావలి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక 37వ వార్డులో టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పోట్లూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈ పూజలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొన్నారు. పూజల అనంతరం నిర్వాహకులు స్థానికులకు అన్న సంతర్పణ గావించారు. మహోత్సవంలో అయ్యప్పలు గురుస్వాములు, రాజకీయ ప్రముఖులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు



వన భోజనాలలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా వన భోజనాలు ఏర్పాటు చేసినట్లు అయ్యప్ప సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు చండీ హోమం, రుద్రహోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాల ధారణ భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నేతలు

వలేటివారిపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అయ్యవారిపల్లెలో టీడీపీ మండలాధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం స్థానికులతో టీడీపీ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో డీలర్ పాలేటి రవి, ఫీల్డ్‌అసిస్టెంట్ మంచాల మాల కొండ్రాయుడు, నాయకులు యల్లంపల్లి భరత్ కుమార్, ఉప్పుటూరి మాల్యాద్రి పాల్గొన్నారు.



నారావారిపల్లిలో రామ్మూర్తినాయుడి మృతదేహానికి నివాళులర్పిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

రామ్మూర్తికి ఘననివాళి

సీఎం నారా చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు. జిల్లావ్యాప్తంగా పార్టీ కార్యాలయాల్లో రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



స్వర్ణలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న విధుశేఖర భారతి

వైభవంగా మహాకుంభాభిషేకం

నెల్లూరులోని స్వర్ణాల చెరువు వద్ద స్వర్ణలింగేశ్వర ఆలయంలో ఆదివారం మహాకుంభాభిషేకం వేడుకగా జరిగింది. స్వర్ణలింగేశ్వరుడితోపాటు పరివార దేవతల విగ్రహాల ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా సాగింది. శృంగేరి దక్షిణామ్నాయ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి సారథ్యంలో వేద పండితులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యా శాఖ కార్యాలయాల్లో పనిచేసే టీచర్లను రిలీవ్ చేయండి

నెల్లూరు(విద్య), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, మూడేళ్లు పూర్తయినవారు పాఠశాల విధుల్లో చేరేలా డీఈవో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిపై పలు ఫిర్యాదులు, ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వారిని తొలగించి ఆయా స్థానాల్లో నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. వాస్తవానికి జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచార సేకరణ, హాజరుతోపాటు ఇతర సాంకేతిక పరమైన అంశాలను కార్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులే పరిశీలిస్తుంటారు. వీరిని విద్యా సంవత్సరం మధ్యలో తొలగిస్తే ఇబ్బందులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. వాస్తవ పరిస్థితులను వారికి తెలియచేసి, తదుపరి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.



పాఠశాలల పని గంటల్లో మార్పులు

జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని గంటలను మార్పు చేస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాను ఎంపిక చేసి, అమలు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు మొదటి బెల్, 9.05 గంటలకు రెండో బెల్, 9.25 వరకు స్కూల్ అసెంబ్లీ నిర్వహించాలని సూచించారు. 9.25 గంటలకు మొదటి పీరియడ్, 10.15 గంటలకు రెండో పీరియడ్ ఉంటుంది. 11 నుంచి 11.15 వరకు స్వల్ప విరామం తర్వాత 11.15 నుంచి మూడో పీరియడ్, 12 నాల్గవ పీరియడ్ నిర్వహించి 12.45 నుంచి 1.45 గంటల వరకు లంచ్ బ్రేక్ ఉంటుంది. తిరిగి 1.45 నుంచి ఐదో పీరియడ్, 2.30 నుంచి ఆరోపీరియడ్, 3.15 నుంచి స్వల్ప విరామం ఉంటుంది. 3.30 నుంచి ఏడో పీరియడ్, 4.15 నుంచి 5 గంటల వరకు 8వ పీరియడ్ నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు పాఠశాలలను తనిఖీ చేసి తనకు నివేదికలు అందచేయాలని డీఈవో తెలిపారు.

విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు : ఏపీటీఎఫ్

పాఠశాలల సమయాన్ని ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు మార్పు చేయడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న సమయాన్నే కొనసాగిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని, ప్రభుత్వం దీనిపై పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఇది సరికాదు.. పీఆర్‌టీయూ

ప్రభుత్వ పాఠశాలల సమయాన్ని మార్పు చేయడం సరికాదని, దీనిపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లోని 8 ఏళ్ల పిల్లవాడు ఉదయం 8 గంటలకు ఇంటి వద్ద బయలుదేరి సాయంత్రం 6 గంటలకు ఇంటికి వెళ్లాల్సి ఉంటుందని, ఇది వారి మానసిక వికాసంపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.



'రాళ్లపాడు'కు జలకళ

● అంతకంతకూ పెరుగుతున్న నీటిమట్టం

లింగసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో నీటిమట్టం 17.6 అడుగులకు చేరగా, 150 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. సోమశిల రిజర్వాయర్ నుంచి 70 క్యూసెక్కులు, పిల్లాపేరు, మన్నేరు వాగుల నుంచి 80 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉంది.

● సోమశిలలో 69.922 టీఎంసీల నిల్వ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 7,349 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 69.922 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 50, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 3,000, ఉత్తరకాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

పేదల మాటున భూముల దోపిడీ ఏవిధంగా జరిగిందో ఫ్రీహోల్డ్ భూముల విచారణతో తేటతెల్లమైంది. ఏకంగా 14,834 ఎకరాలను అక్రమ మార్గంలో నిషేధిత జాబితా నుంచి తొలగించి స్వాహా చేశారు. అయితే అదే స్థాయిలో గతేడాది జరిగిన అసైన్‌మెంట్ భూముల పంపిణీలో కూడా అక్రమాలు జరిగాయి. భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాల్సి ఉండగా ఆ మాటున వైసీపీ నేతలు, భూస్వాములు ప్రభుత్వ భూములను కొల్లగొట్టారు. వైసీపీ హయాంలో పింఛన్ మంజూరు చేసినా ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న అప్పటి ఎమ్మెల్యేలు.. భూ పంపిణీ విషయాలను మాత్రం బయటకు పొక్కనీయలేదు. నాటి అధికారులు కూడా వైసీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి భూ పంపిణీ జాబితాను బయటకు ఇవ్వలేదు. నాడు అత్యంత గోప్యంగా జరిగిన ఈ ప్రక్రియపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారింది కాబట్టి విచారణ జరిపితే అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అడ్డగోలుగా..!



- ఫ్రీహోల్డ్ సరే.. అసైన్‌మెంట్ మాటేమిటి?
- గతేడాది పేదలకు భూముల పంపిణీ
- ఆ మాటున భారీగా వైసీపీ నేతలకు ధారాదత్తం
- కొండలు, చెరువులను కూడా స్వాహా చేసిన అక్రమార్కులు
- నాడూ గ్రామసభలు లేకుండానే అర్హుల గుర్తింపు
- కనీసం ఈ జాబితాను కూడా బయటపెట్టని అధికారులు
- ఇప్పుడు విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి..

నెల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భూములకు సంబంధించిన వ్యవహారంలో గ్రామసభలు చాలా కీలకం. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో ఎలాగైతే గ్రామసభలు లేకుండానే అర్హుల జాబితాను రూపొందించారో అదే మాదిరి అసైన్‌మెంట్ భూముల పంపిణీ విషయంలోనూ గ్రామసభలు లేకుండా పని కానిచ్చేశారు. ఒక గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలంటే ముందుగా ఆ గ్రామంలోని నిరుపేదలకు పంపిణీ చేయాలి. మిగిలిన భూములనే ఇతర గ్రామాల వారికి పంపిణీ చేయాల్సి ఉంటుంది. గ్రామసభలు నిర్వహిస్తే భూమి లేని నిరుపేదలు ఎవరన్నది తెలుస్తుంది. కానీ అలా జరగకుండా వైసీపీ నేతలకు ఏ గ్రామంలో భూములు ఖాళీగా ఉంటే అక్కడ కట్టబెట్టారు. ఇక భూమి ఉన్న వారికి అసైన్‌మెంట్ కింద కొత్తగా భూమి ఇవ్వడానికి వీల్లేదు. అయినా చాలా మంది భూస్వాముల కుటుంబాలకు అసైన్‌మెంట్ కింద భూములు రాసిచ్చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గతేడాది డిసెంబరులో సుమారు 10 వేల ఎకరాలకు అసైన్‌మెంట్ కింద పంపిణీ చేసినట్లు సమాచారం. అందులో సగ భాగం అనర్హులకు పంచినట్లు ఆరోపణలు ఉన్నాయి.

● పొదలకూరులో బట్టబయలు

పొదలకూరు మండలంలో గతేడాది పంపిణీ చేసిన అసైన్‌మెంట్ భూములపై ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపారు. ఈ విచారణలో అనేక అక్రమాలు వెలుగుచూశాయి. అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే చాలా మందికి పట్టాలు ఇచ్చేశారు. అప్పటికే భూములున్న వారికి కూడా కొత్తగా అసైన్‌మెంట్ కింద భూములు పంపిణీ చేశారు. ఇతర మండలాల వ్యక్తులకూ భూములు కట్టబెట్టారు. కొండ పోరంబోకు, మేత పోరంబోకు భూములను కూడా ధారాదత్తం చేయడం గమనార్హం. ఓ కంపెనీకి కొండ పోరంబోకు భూములు రాసివ్వగా, మరో గ్రామంలో మేత పోరంబోకు భూములను కట్టబెట్టినట్లు విచారణలో తేలింది. ఈ విచారణ నివేదిక ఆధారంగా అప్పటి తహసీల్దార్‌ను ఇటీవల సస్పెండ్ చేశారు. ఇప్పుడు ఆ భూములన్నింటినీ వెనక్కు తీసుకునే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమై ఉన్నారు. అయితే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదుతోనే పొదలకూరు మండలంలో విచారణ జరిపారు. ప్రభుత్వం నుంచి మాత్రం అసైన్‌మెంట్ భూములపై విచారణ జరపమని ఎటువంటి ఆదేశాలు రాలేదని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. అయితే జిల్లా ఉన్నతాధికారులే చొరవ తీసుకొని జిల్లావ్యాప్తంగా అసైన్‌మెంట్ భూముల పంపిణీపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. అప్పుడు నిజమైన పేదలకు న్యాయం దక్కుతుంది.

ప్రజా సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఇకపై మున్సిపల్, మండల స్థాయిలో నిర్వహించనుంది. ప్రభుత్వ వికేంద్రీకరణ నిర్ణయంతో జిల్లా కేంద్రానికి వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని కోరే అర్జీదారులకు సమయం ఆదా కావడమేగాక ప్రయాణ ఖర్చు తగ్గుతుంది.



కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఇక ఎక్కడికక్కడే!

- మండల, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహణ
- నేటి నుంచి అమలులోకి..

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయిలో సమస్యలు పరిష్కారంకాక కలెక్టర్ ద్వారానైనా సమస్యలు పరిష్కరించుకుంటామని అర్జీదారులు కలెక్టరేట్‌కు ప్రతి సోమవారం వస్తున్నారు. కలెక్టర్‌తోపాటు, జిల్లాస్థాయి అధికారులంతా పాల్గొనే ఈ కార్యక్రమంలో తమ సమస్యలు



పరిష్కారం అవుతాయని వారు భావిస్తుంటారు. ప్రతి సోమవారం 150 నుంచి 200 మంది అర్జీదారులు కలెక్టరేట్‌కు వస్తుంటారు. అయితే మండల స్థాయి అధికారులను అసలు కలవకుండా నేరుగా కలెక్టరేట్‌కు అర్జీదారులు రావడాన్ని ప్రభుత్వం గమనించింది. మండల స్థాయిలో సులభంగా పరిష్కారమయ్యే చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దృష్టికి వస్తున్నాయి. దీంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక వికేంద్రీకరణకు చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి ఏర్పడింది.

● అధికారులంతా ఉండాల్సిందే

ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం నుంచి మండల, మున్సిపల్ స్థాయిలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ మేరకు పట్టణ, మండల స్థాయి అధికారులంతా వేదికకు తప్పకుండా హాజరు కావాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం మండల కార్యాలయాల్లో అర్జీలు సమర్పించాలని కోరారు. అదేవిధంగా అధికారులంతా ఫిర్యాదులను నిర్దిష్ట సమయంలో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.



నెల్లూరుకు చేరుకున్న రోడ్డు క్లీనింగ్ యంత్రాలు



చెన్నైలో డ్రైనేజీ కాలువల్లో పూడికతీత యంత్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

పారిశుధ్యంలోకి యంత్ర పాలన

- రోడ్ల శుభ్రతతోపాటు కాలువల్లో పూడికతీత
- ఇళ్ల మధ్య కాలువల్లో 'బందికూట్'తో శుభ్రం
- మురుగునీరు శుద్ధిచేసి పరిశ్రమలకు సరఫరా
- తమిళనాడు, కేరళలో కమిషనర్ అధ్యయనం
- రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన
- నెల్లూరులో అమలుకు కసరత్తు

నెల్లూరులో జఠిలమవుతున్న పారిశుధ్య సమస్యకు చెక్ పెట్టేందుకు యంత్ర పాలనను కూటమి ప్రభుత్వం అమలులోకి తీసుకురానున్నది. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో అవలంభిస్తున్న పుర సేవలను ఇటీవల ఎన్ ఎంసీ కమిషనర్ సూర్యతేజ అధ్యయనం చేశారు. అక్కడ యంత్రాలతో అనుసరిస్తున్న విధానాలను నెల్లూరులోనూ అమలు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. రోడ్లు క్లీనింగ్ నుంచి ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీసే వరకు యంత్రాలతోనే నిర్వహించిన చివరకు ఇళ్ల మధ్యనున్న డ్రైనేజీ కాలువల్లోనూ 'బందికూట్' యంత్రాలతో శుభ్రం చేసేందుకు ప్రతిపాదనలు పురపాలక శాఖకు చేరాయి. అక్కడ నుంచి అనుమతులు రాగానే నగరంలో యంత్రపాలన మొదలుకానున్నది.

నెల్లూరు (సిటీ), (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని ప్రధాన నగరాల్లో మురుగు కాలువల్లో యంత్రాలతోనే పూడికతీత జరుగుతుంది. కేరళలో బందికూట్ అనే యంత్రంతో ఇళ్ల మధ్యనున్న డ్రైనేజీ కాలువల్లో పూడికతీసి ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుంది. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన పారిశుధ్య సమస్యకు కళ్లెం పడినట్లే. వీటిపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసిన నెల్లూరు కమిషనర్ సూర్యతేజ వాటి వల్ల ఉపయోగాలు, కార్మికులకు ప్రత్యామ్నాయం, ప్రజలకు మెరుగైన సేవలు అందడం, ప్రతికూల పరిస్థితుల్లోనూ సమర్థవంతమైన నిర్వహణ సాధ్యమవుతుందని రాష్ట్ర పురపాలక శాఖకు నివేదిక ఇచ్చారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ అధ్యయన వివరాలన్నీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పురపాలక శాఖకు విజయవాడలో వివరించారు. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆ శాఖ ఉన్నతాధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించారు. పొరుగు రెండు రాష్ట్రాల్లో కమిషనర్ స్వయంగా పాల్గొనడం, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ నెల్లూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో తొలుత ఈ యంత్రాపాలన నెల్లూరులోనే ప్రయోగాత్మకంగా మొదలుపెట్టేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే ఆయా యంత్ర కంపెనీలతో సంప్రదింపులు జరిగిన ఉన్నతాధికారులు వీటిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

కసరత్తు చేస్తున్నాం

నెల్లూరులో మెరుగైన పారిశుధ్య పనుల కోసం కసరత్తు చేస్తున్నాము. ఇందులో యంత్రాలతో మరింత మెరుగైన ఫలితాలు ఆశించవచ్చు. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని అక్కడి పురపాలక శాఖ ఇదే చేస్తోంది. మన ప్రభుత్వానికి కూడా వివరించాము. త్వరలోనే నెల్లూరులోనూ అమలుకు కసరత్తు జరుగుతోంది.

- సూర్యతేజ, ఎన్ఎంసీ కమిషనర్

● కృష్ణపట్నంకు శుద్ధి నీరు

నెల్లూరులోని భూగర్భ డ్రైనేజీ ద్వారా ఎస్టీపీ (మురుగు నీటి శుద్ధి ప్లాంటు)లకు చేరే మురుగునీటిని శుద్ధి చేసి కృష్ణపట్నంలోని పరిశ్రమలకు తరలించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. తమిళనాడులో ఈ విధమైన ప్రక్రియ ద్వారా అక్కడి పురపాలక శాఖ రూ.కోట్ల ఆదాయం సమకూరుతోంది. దీనిపై కమిషనర్ సూర్యతేజ అధ్యయనం చేసి అందుకు తగిన ప్రతిపాదనలను పురపాలక శాఖ ముందుంచారు. నెల్లూరులో అల్లీపురం, పొట్టేపాళెం, వెంకటేశ్వరపురం ప్రాంతాలలో కలిపి 71 ఎంఎల్డీ సామర్థ్యం కలిగిన ఎస్టీపీలు ఉన్నాయి. ఇవన్నీ భూగర్భ డ్రైనేజీతో అనుసంధానమై పని చేయనున్నాయి. వీటిల్లోకి వచ్చే మురుగు నీటిని వివిధ దశల్లో శుద్ధి చేసి సురక్షితమైన వాడుక నీటి దశకు తీసుకువచ్చి అనంతరం కృష్ణపట్నంలోని పలు పరిశ్రమలకు తరలించనున్నారు. ఇప్పటికే కృష్ణపట్నం నుంచి నీటి అవసరాల నిమిత్తం నెల్లూరు కార్పొరేషన్ అభ్యర్థనలతో కూడిన ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ ప్రక్రియ అమల్లోకి వస్తే ఎన్ఎంసీకి రూ.కోట్ల ఆదాయం సమకూరనున్నది. ఈ కృతువుకు త్వరలోనే బీజం పడనున్నది.